


పెండింగ్ కేసులపై దృష్టి సారించాలి: ఎస్పీ

పార్వతీపురం టౌన్, అక్టోబరు 2 : పెండింగ్ కేసులపై దృష్టి సారించాలని ఎస్పీ మాధవరెడ్డి ఆదేశించారు. బుధవారం పార్వతీపురం పోలీసు సబ్ డివిజనల్ కార్యాలయాన్ని సందర్శించారు. ఎస్సీ, ఎస్టీ కేసుల దర్యాప్తు ఏ విధంగా జరుగుతుందని ఏఎస్పీ అంకిత సురానాను అడిగి తెలుసుకున్నారు. అనంతరం దర్యాప్తు విధానాలపై సూచనలిచ్చారు. రికార్డులు పెండింగ్‌లో లేకుండా చూసుకోవాలన్నారు. గంజాయి, నాటుసారా అక్రమ రవాణా నియంత్రణకు చర్యలు చేపట్టాలన్నారు. శాంతిభద్రతలకు సంబంధించి సమస్యలుంటే ఉన్నతాధికారులకు తెలియజేయాలని సూచించారు.

శరన్నవరాత్రి

- ముస్తాబైన పాలకొండ కోటదుర్గమ్మ దేవస్థానం
- 12 వరకు ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు
- నేడు నిజరూప దర్శనం
- భారీగా తరలిరానున్న భక్తులు



విద్యుత్ దీపాల వెలుగుల్లో కోటదుర్గమ్మ ఆలయం



ఆలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక క్యూలైన్లు

ఉత్సవాలకు వేళాయే..

పాలకొండ: ఉత్తరాంధ్రుల ఆరాధ్యదైవం.. భక్తుల కోర్కెలు తీర్చే కల్పవల్లి పాలకొండ కోటదుర్గమ్మ శరన్నవరాత్రి ఉత్సవాలకు సర్వం సిద్ధమైంది. నేటి నుంచి 12 వరకు వేడుకలను వైభవంగా నిర్వహించేందుకు దేవదాయశాఖాధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. భక్తులు, వీఐపీలు, వీవీఐపీల తాకిడిని దృష్టిలో ఉంచుకొని ప్రత్యేక క్యూలైన్లను సిద్ధం చేశారు. ఆలయ తాత్కాలిక కమిటీ ఘటాలు, ముర్రాటలు చెల్లించేవారి కోసం, సర్వ దర్శనం కోసం వచ్చే భక్తులకు వేర్వేరుగా క్యూలైన్లు, టెంట్ హౌస్‌లు ఏర్పాటు చేశారు. ఇప్పటికే విద్యుత్ దీపాలతో పాలకొండ ప్రధాన రహదారిని, ఆలయ ప్రాంగణాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. కాగా ఆలయానికి వచ్చిన భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూస్తున్నట్టు ఆలయ ఈవో వీవీ సూర్యనారాయణ తెలిపారు. నేటి నుంచి తొమ్మిది రోజుల పాటు సామూహిక కుంకుమార్చనలు, ప్రత్యేక పూజలు చేపట్టనున్నట్లు ప్రధాన అర్చకుడు డి.లక్ష్మీ ప్రసాదశర్మ చెప్పారు. ఏటాలానే ఈ సారి కూడా తాత్కాలిక కమిటీ ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలకు ఏర్పాట్లు చేసినట్లు సంబంధిత అధికారులు తెలిపారు.

తొలిరోజు నిజరూప దర్శనం..

ఉత్సవాలు తొలిరోజైన గురువారం ఉదయం 8 గంటలకు ముహూర్తపు రాట వేశారు. అనంతరం ఉదయం 8.30 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు భక్తులకు అమ్మవారి నిజరూప దర్శనభాగ్యం కల్పిస్తారు. ఉత్తరాంధ్ర జిల్లాలతో పాటు ఒడిశా, తెలంగాణ తదితర రాష్ట్రాల నుంచి సుమారు 60 వేల మంది వరకు వస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు. మిగిలిన ఎనిమిది రోజుల పాటు స్వర్ణాలం కరణలో అమ్మవారు భక్తులకు దర్శనమివ్వనున్నారు.



కోటదుర్గమ్మ

సామూహిక సంబరాలు

దసరా నవరాత్రి ఉత్సవాల్లో పాలకొండ పట్టణంలోని 20 వార్డుల పరిధిలో ఉన్న 47 వేల జనాభాతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి రోజూ అమ్మవారికి ముర్రాటలు, ఘటాలతో సామూహిక సంబరాలు జరపడం ఆనవాయితీ. ప్రధానంగా ఆదివారం, మంగళవారం, బుధవారం అమ్మవారి నామస్మరణతో పాలకొండ మార్మోగనుంది. ఈ నేపథ్యంలో దేవదాయ, పోలీస్, నగర పంచాయతీ, విద్యుత్, ఆర్అండ్‌బీ తదితర శాఖల అధికారులు సమన్వయంతో ముందుకు సాగుతున్నారు. కాగా కోటదుర్గమ్మ ఉత్సవాలకు అందుకు అందరూ సహకరించాలని డీఎస్పీ ఎం.రాంబాబు, సీఐ చంద మౌళి, నగర పంచాయతీ కమిషనర్ సర్వేశ్వరరావు, కోటదుర్గమ్మ ఆలయ అభివృది కమిటీ ఛైర్మన్ కొండలరావు తదితరులు కోరారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు గంటా సంతోష్‌కుమార్, తాత్కాలిక కమిటీ సభ్యులు, వలంటీర్ల ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. ఆలయ ప్రాంగణంలో తాగునీటి వసతి, చలువ పందిళ్లు, క్యూలైన్‌లు, నవరాత్రల్లో అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు.

వాహనాల పార్కింగ్ ఇలా..

ట్రాఫిక్‌కు ఇబ్బందులు తలెత్తకుండా పోలీసులు ప్రత్యేకంగా పార్కింగ్ స్థలాలను కేటాయించారు. వీరఘట్టం నుంచి వచ్చే వారు వీరఘట్టం జంక్షన్ వద్ద, రాజాం మీదుగా వచ్చేవారు ఆర్అండ్‌బీ బంగ్లా వద్ద, శ్రీకాకుళం, సీతంపేట వైపు నుంచి వచ్చే భక్తులు ఆర్డీవో కార్యాలయం పక్కన ఉన్న ఖాళీ స్థలంలో వాహనాలను పార్కింగ్ చేయాల్సి ఉంది. ఒడిశా, ఛత్తీస్‌గడ్ నుంచి పార్వతీపురం మీదుగా పాలకొండ వచ్చే వాహనాలను రాజాం, చిలకపాలెం మీదుగా హైవేకు మళ్లించనున్నారు. తొమ్మిది రోజుల పాటు భారీ వాహనాలకు పట్టణంలో అనుమతి లేదు. ఆర్టీసీ బస్సులు, ఇతర వాహనాలను పాలకొండ, రాజాం రోడ్డులోని అన్నవరం జంక్షన్ నుంచి వడమ మీదుగా వాహనాలను మళ్లించనున్నారు. 200 మందికిపైగా పోలీసులతో బందోబస్తు నిర్వహిస్తున్నట్లు డీఎస్పీ రాంబాబు తెలిపారు.

శంబర పోలమాంబ ఆలయంలో ...

మక్కువ: శంబర పోలమాంబ ఆలయంలోనూ నేటి నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలను నిర్వహించనున్నట్లు ఈవో వీవీ సూర్యనారాయణ బుధవారం తెలిపారు. ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. రోజూ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని, పోలమాంబ తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.



బాపూజీకి ఘన నివాళి

పార్వతీపురం, అక్టోబరు2 (ఆంధ్రజ్యోతి) : జిల్లావ్యాప్తంగా గాంధీజీ, లాల్‌బహదూర్ శాస్త్రి జయంత్యుత్సవాలను ఘనంగా నిర్వహించారు. వాడవాడలా వారి విగ్రహాలు, చిత్రపటాలకు పూల మాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా వారి సేవలను కొనియాడారు. ఇందులో అధికారులు, ప్రజాప్రతినిధులు భాగస్వాములయ్యారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్, సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, ఇన్‌చార్జి డీఆర్వో జి.కేశనాయుడు తదితరులు బాపూజీ, శాస్త్రి చిత్రపటాలకు పూలమాలలు వేశారు. వారి జీవితాలను స్ఫూర్తిగా తీసుకొని దేశ అభివృద్ధికి పాటుపడాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీరింగ్ అధికారి ఓ.ప్రభాకరరావు, కలెక్టర్ కార్యాలయ పరిపాలనాధికారి ఎం.సావిత్రి, సూపరింటెండెంట్ శ్రీరామ్మూర్తి, కలెక్టర్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



గాంధీజీ విగ్రహానికి పూలమాల వేస్తున్న మంత్రి సంధ్యారాణి



కలెక్టరేట్‌లో గాంధీజీ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న కలెక్టర్ తదితరులు

సాలూరులో..

సాలూరు రూరల్: సాలూరు తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణంలో ఉన్న గాంధీజీ విగ్రహానికి మంత్రి గుమ్మిడి సంధ్యారాణి, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భంజ్‌దేవ్ పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం మహాత్మా గాంధీజీ దేశానికి స్వాతంత్ర్యం తెచ్చిన విధానాన్ని మంత్రి వివరించారు. గత ప్రభుత్వంలో ప్రజలకు స్వాతంత్ర్యం లేకుండా పోయిందన్నారు. గట్టిగా ప్రశ్నించడానికి, నిరసన తెలపడానికి వీలు లేకుండా పోయిందన్నారు. దీంతో విసిగిపోయిన ప్రజలు ఓటుతో వైసీపీకి గట్టి బుద్ధి చెప్పి.. చంద్రబాబును సీఎంగా చేశారన్నారు. మహిళల రక్షణకు ఈ నెల 5న సాలూరులో జిల్లా సదస్సు నిర్వహించనున్నామని చెప్పారు. స్థానిక మహిళా ప్రజాప్రతినిధులు, మహిళా సంఘాలు హాజరు కావాలని కోరారు. అనంతరం అన్న క్యాంటీన్ నిర్మాణ పనులను పరిశీలించారు.

వరదొస్తే.. పడవెక్కాల్సిందేనా..

కొమరాడ: నాగావళి నదిలో స్వల్పంగా వరద నీటి ప్రవాహం పెరిగింది. దీంతో నదికి ఆవల వైపు ఉన్న కొమరాడ మండలానికి చెందిన ఎనిమిది గ్రామ పంచాయతీల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం వారంతా నాటు పడవపై రాకపోకలు సాగిస్తున్నారు. పూర్ణపాడు-లాబేసు వంతెన నిర్మాణం పూర్తికాకపోవడంపై ఏటా వర్షాకాలంలో వారికీ ఇక్కట్లు తప్పడం లేదు. వరద ప్రవాహం ఎక్కువగా ఉన్నప్పుడు ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని నది దాటాల్సి వస్తోందని ఆయా గ్రామస్థులు వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించాలని వారు కోరుతున్నారు. వాస్తవంగా గత టీడీపీ ప్రభుత్వ హయాంలో వంతెన నిర్మాణం 80 శాతం పూర్తయ్యింది. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం మిగిలిన పనులను చేపట్టకుండా తాత్సారం చేసింది. దీంతో కొట్టు, కెమిశీల, గుణదతీలేసు, మాదలంగి, వన్నాం, పాలెం, దళాయి పేట, తొడుము ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీ ప్రకారం.. నాగావళి నదిలో నీటి ప్రవాహం తగ్గిన వెంటనే వంతెన నిర్మాణం చేపడతామని ఎమ్మెల్యే జగదీశ్వరి తెలిపారు.



నాగావళి నది ఆవల వైపునకు నాటు పడవపై వెళ్తున్న ప్రజలు

గృహయోగం దిశగా..

- పేదల సొంతింటి కల నెరవేర్చేందుకు చర్యలు
- 'మన ఇల్లు...మన గౌరవం' పేరిట చైతన్య కార్యక్రమాలు
- త్వరగా గృహ నిర్మాణాలు పూర్తిచేయించాలని అధికారులకు ఆదేశం
- లబ్ధిదారులకు భరోసా కల్పిస్తున్న కూటమి ప్రభుత్వం



పార్వతీపురం, అక్టోబరు2 (ఆంధ్రజ్యోతి) : పేదల సొంతింటి కల నెరవేర్చడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఈ మేరకు ప్రధాన మంత్రి ఆవాస యోజన పథకంలో మంజూరైన ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇప్పటికే 'మన ఇల్లు..మన గౌరవం' పేరిట అధికారులను లబ్ధిదారుల వద్దకు పంపి చైతన్య కార్యక్రమాలు నిర్వహించింది. వాస్తవంగా పీఎం ఆవాస్ యోజన పథకం కింద గతంలో మంజూరైన ఇళ్ల నిర్మాణలను వచ్చే ఏడాది మార్చిలోగా పూర్తి చేయాల్సి ఉంది. లేకుంటే బిల్లులు మంజూరయ్యే అవకాశం లేదు. దీంతో కూటమి ప్రభుత్వం అధికారులను అప్రమత్తం చేసింది. లబ్ధిదారులతో నేరుగా మాట్లాడి ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయించాలని సూచించింది. గ్రూప్ లెవెల్‌లో ఉన్నవి ఈ నెలాఖరుకు, మిగిలిన ఇళ్ల నిర్మాణాలను వచ్చే ఏడాది మార్చి నాటికి పూర్తి చేయించాలని హౌసింగ్‌తో పాటు వివిధ శాఖల అధికారులకు ఆదేశాలిచ్చింది.

ఇదీ పరిస్థితి..

- పీఎం ఆవాస్ యోజన పథకంలో మంజూరైన ఇళ్ల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వమే నిధులు మంజూరు చేస్తుంది. అయితే గత వైసీపీ ప్రభుత్వం మాత్రం ఈ ఇళ్లకు జగనన్న కాలనీ బోర్డులు తగిలించింది. నిర్మాణాలకు నిధులిస్తున్నట్లుగా ప్రచారం చేసుకుంది. కానీ ఆచరణలో నిర్లక్ష్యంగా వ్యవహరించింది. నివాస యోగ్యం కాని ప్రాంతాల్లో స్థలాలు మంజూరు చేయగా, అక్కడ మౌలిక వసతులు కల్పించకపోవడం, బిల్లులు సకాలంలో మంజూరు చేయక పోవడం, గృహ నిర్మాణ సామగ్రి ధరలు నింగినంటడం తదితర కారణాలతో చాలామంది లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలకు ముందుకు రాలేదు.
- జిల్లాలో జగనన్న లేఅవుట్లతో పాటు సొంత స్థలాల యజమానులకు మొత్తంగా 26,062 ఇళ్లు మంజూరు చేశారు. ఇందులో 546 మంది తమ ఆర్థిక పరిస్థితులు అనుకూలంగా లేకపోవడంతో పూర్తిగా ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించలేదు. బీబీఎల్ స్టేజ్‌లో 3,080, పీబీ స్టేజ్‌లో 1043, బీఎల్ స్టేజ్‌లో 2091, ఎల్ఎల్ స్టేజ్ 2,896, ఆర్ఎల్ స్టేజీలో 1401, ఆర్సీ స్టేజ్‌లో 599 ఇళ్లు ఉన్నాయి. ఇప్పటివరకు నిర్మా ణాలు పూర్తయిన ఇళ్లు 14,406 ఉండగా ఇందులో సొంత స్థలాలు, యజమానులు నిర్మించుకున్నవి 8 వేల పైబడి ఉన్నట్లు తెలుస్తోంది.

తక్కువ ఖర్చుతో పూర్తయ్యేలా...

ఈ నేపథ్యంలో కూటమి సర్కారు ఆదేశాలతో జిల్లాలో ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేసేందుకు గాను ఇప్పటికే అధికారులు జాబితాను సిద్ధం చేశారు. ఏ మండలంలో ఎన్ని ఇళ్లు అసంపూర్తిగా ఉన్నాయన్న సమాచారాన్ని సేకరించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి సచివాలయం పరిధిలో త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసేందుకు ప్రత్యేక ప్రణాళిక లను రూపొందిస్తున్నారు. ఇప్పటికే అధికారులు లబ్ధిదారులతో మాట్లాడి.. అవగాహన కల్పిస్తున్నారు. గృహ నిర్మాణాలను మధ్యలోనే ఆపేయడానికి గల కారణాలను అడిగి తెలుసుకుంటున్నారు. తక్కువ ఖర్చుతో ఇళ్ల నిర్మాణాలు ఎలా చేపట్టాలనే దానిపై లబ్ధిదారులకు సలహాలు, సూచనలు అందిస్తున్నారు.

- పునాది నుంచి లింటల్ స్థాయిలో ఉన్న ఇళ్లను వచ్చే ఏడాది మార్చిలోగా పూర్తి చేసేందుకు ప్రత్యేక ప్రణాళికలను రూపొందిస్తున్నారు. అదే విధంగా శ్లాబ్ లెవెల్‌లో ఉన్న ఇళ్ల పనులను డిసెంబరులోగా పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.



గృహ నిర్మాణ లబ్ధిదారులకు అవగాహన కల్పిస్తున్న ఇన్‌చార్జి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఫైల్)

ఎన్టీఆర్ గృహ నిర్మాణ లబ్ధిదారులకు అండగా...

గత టీడీపీ ప్రభుత్వ కాలంలో మంజూరైన ఎన్టీఆర్ గృహ నిర్మాణాలపై వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించింది. బిల్లులను చెల్లించకుండా లబ్ధిదారులను ఇబ్బందులకు గురిచేసింది. దీంతో ఆయా ఇళ్ల నిర్మాణాలకు బ్రేక్ పడింది. కాగా అధికారంలోకి కూటమి ప్రభుత్వం ఎన్టీఆర్ గృహ నిర్మాణాలపై దృష్టి సారించింది. బిల్లుల చెల్లింపులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చి.. లబ్ధిదారులకు ఊరట కలిగించింది. దీనిపై అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేయడంతో 2016-2019 మధ్య కాలంలో మంజూరైన ఎన్టీఆర్ గృహాల జాబితాను సిద్ధం చేస్తున్నారు. అప్పట్లో 14,993 ఇళ్లు మంజూరు కాగా ఇందులో 8,785 మంది గృహ నిర్మాణాలు ప్రారంభించారు. అందులో 6,155 ఇళ్ల సర్వే పూర్తి చేయగా సుమారు 93 మందిని అనర్హులుగా గుర్తించారు. ఇళ్లు నిర్మించుకున్న అర్హులందరికీ త్వరలో బిల్లులు చెల్లించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది.

పూర్తి చేయిస్తాం..

జిల్లాలో మధ్యలో నిలిచిపోయిన గృహ నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేసేందుకు గాను లబ్ధిదారులను చైతన్యపరిచాం. ప్రభుత్వ లక్ష్యం నెరవేరే విధంగా ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయిస్తాం.

- రత్నకుమార్, ఇన్‌చార్జి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, గృహ నిర్మాశాఖ...

కొండ దిగితేనే సిగ్నల్స్..



మహిళల నుంచి థంబ్‌లు సేకరిస్తున్న సీఎఫ్

సీతంపేట రూరల్, అక్టోబరు 2: సీతంపేట ఏజెన్సీలో కొండ శిఖర గ్రామాలకు సెల్ సిగ్నల్స్ ఉండడం లేదు. దీంతో గిరిపుత్రులకు అవస్థలు తప్పడం లేదు. రామా నగరానికి చెందిన గిరిజన మహిళలు ఉన్నతి పథకం కింద టీఎస్పీ(ట్రైబల్ సబ్‌ప్లాన్)రుణం పొందేందుకు దరఖాస్తు చేసుకున్నారు. అయితే దీనికి సంబంధించి థంబ్ వేయాల్సి ఉంది. కాగా ఆ గ్రామంలో సెల్ సిగ్నల్స్ లేకపోవడంతో బుధవారం ఆరిక అప్పమ్మ, మాణిక్యం, తులసి, పూర్ణమ్మ తదితరులు సుమారు ఆరు కిలోమీటర్లు నడిచి .. కొండ దిగి కోసంగి సెంటర్‌కు చేరుకున్నారు. అక్కడ సిగ్నల్ అందుబాటులో ఉండడంతో సంబంధింత వెలుగు సీఎఫ్ బి.గోపాలరావు వీరి వద్ద నుంచి థంబ్‌లు సేకరించి రుణం మంజూరుకు ఏర్పాట్లు చేశారు. ఈ సమస్యపై ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించాలని ఆయా ప్రాంత గిరిజనులు కోరుతున్నారు.

సాలూరు ఏజెన్సీలో భారీ వర్షం

సాలూరు రూరల్, అక్టోబరు 2: సాలూరు పట్టణంతో పాటు ఏవోబీ లోని సారిక, నేరేళ్లవలస, దొరలతాడివలస, ధూళిభద్ర తదితర గ్రామాల్లో బుధవారం సాయంత్రం ఈదురుగాలులతో భారీ వర్షం కురిసింది. సారిక వద్ద రోడ్డుకు అడ్డంగా చెట్టు కూలింది. దీంతో ఈ ప్రాంతం మీదుగా ఏపీ-ఒడిశాలకు రాకపోకలు నిలిచిపోయాయి. చెట్టు తొలగించడానికి స్థాని కులు చర్యలు చేపట్టారు. మరోవైపు పట్టణంలో వేణుగోపాల స్వామి ఆల యం వద్ద ఉన్న అపార్ట్‌మెంట్‌లోకి మురుగునీరు చేరింది. దీంతో అక్కడున్న వారు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.



సారిక వద్ద రోడ్డుకు అడ్డంగా కూలిన చెట్టు

దిక్సూచి DIKSUCHI

ఎన్ఐడీలో బీ డిజైన్



అహ్మదాబాద్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజైన్ (ఎన్ఐడీ)- బ్యాచిలర్ ఆఫ్ డిజైన్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఆంధ్రప్రదేశ్ సహా అహ్మదాబాద్, హరియాణా, మధ్యప్రదేశ్, అసోం క్యాంపస్‌లలో బీ డిజైన్ ప్రోగ్రామ్ అందుబాటులో ఉంది. దీని వ్యవధి నాలుగేళ్లు. ఈ ప్రోగ్రామ్‌ను ఆంగ్ల భాషలో నిర్వహిస్తారు. డిజైన్ ఆప్టిట్యూడ్ టెస్ట్ (డీఏటీ) ద్వారా ప్రవేశాలు కల్పిస్తారు. ఇందులో ప్రిలిమ్స్, మెయిన్స్ దశలు ఉంటాయి. ప్రిలిమ్స్‌లో అర్హత పొందినవారిని మెరిట్ ప్రకారం షార్ట్‌లిస్ట్ చేస్తారు. ప్రతి కేటగిరీలో సీట్ల సంఖ్యకు మూడు రెట్లమందిని మెయిన్స్‌కు అనుమతిస్తారు. ప్రిలిమ్స్, మెయిన్స్ స్కోర్ ఆధారంగా తదుపరి అడ్మిషన్ ప్రక్రియ నిర్వహిస్తారు.

బీ డిజైన్

విభాగాలు: యానిమేషన్ ఫిల్మ్ డిజైన్, ఎగ్జిబిషన్ డిజైన్, ఫిల్మ్ అండ్ వీడియో కమ్యూనికేషన్, గ్రాఫిక్ డిజైన్, సిరామిక్ అండ్ గ్లాస్ డిజైన్, ఫర్నిచర్ అండ్ ఇంటీరియర్ డిజైన్, ప్రొడక్ట్ డిజైన్, టెక్స్‌టైల్ డిజైన్.

సీట్లు: అహ్మదాబాద్ క్యాంపస్‌లో 125 సీట్లు; ఆంధ్రప్రదేశ్, హరియాణా, మధ్యప్రదేశ్, అసోం క్యాంపస్‌లలో ఒక్కోదానిలో 75 సీట్లు ఉన్నాయి. విదేశీ విద్యార్థుల కోసం అహ్మదాబాద్ క్యాంపస్‌లో 19 సీట్లు, మధ్యప్రదేశ్ క్యాంపస్‌లో 11 సీట్లు, హరియాణా క్యాంపస్‌లో 11 సీట్లు అదనంగా ఉన్నాయి.

అర్హత: అభ్యర్థులు 2004 జూలై 1 తరవాత జన్మించి ఉండాలి. సీబీఎస్ఈ/ఐబీ/ఐసీఎస్ఈ/ఇతర గుర్తింపు పొందిన బోర్డుల నుంచి 2024-25 విద్యా సంవత్సరం నాటికి సైన్స్, ఆర్ట్స్, కామర్స్, హ్యూమానిటీస్ గ్రూప్‌లతో ఇంటర్/పన్నెండో తరగతి/తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. 2025లో చివరి సంవత్సర పరీక్షలు రాసే వారు కూడా అర్హులే. వీరు 2025 జూలై 15 నాటికి మార్కుల పత్రాలు సబ్మిట్ చేయాలి. నేషనల్ డిఫెన్స్ అకాడమీ నిర్వహించే రెండేళ్ల 'జాయింట్ సర్వీసెస్ వింగ్ కోర్సు' ఉత్తీర్ణులు; నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓపెన్ స్కూలింగ్(ఎన్ఐఓఎస్) నుంచి కనీసం అయిదు సబ్జెక్టులతో సీనియర్ సెకండరీ స్కూల్ ఎగ్జామినేషన్ ఉత్తీర్ణులు; హెచ్ఎస్‌సీ ఒకేషనల్ ఎగ్జామ్ పాసైనవారు; బోర్డ్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ నిర్వహించే మూడేళ్ల డిప్లొమా కోర్సులు పూర్తిచేసినవారు; జనరల్ సర్టిఫికెట్ ఎడ్యుకేషన్(జీసీఈ) అడ్వాన్స్‌డ్ లెవెల్ ఎగ్జామ్(లండన్/శ్రీలంక) ఉత్తీర్ణులు కూడా అప్లయ్ చేసుకోవచ్చు.

డీఏటీ వివరాలు: ప్రిలిమ్స్‌ను పేపర్-పెన్సిల్/పెన్ విధానంలో నిర్వహిస్తారు. టెక్స్ట్, విజువల్స్ అంశాల నుంచి ప్రశ్నలు అడుగుతారు. ప్రశ్నపత్రం ఆంగ్ల మాధ్యమంలో ఉంటుంది. పరీక్ష వ్యవధి వివరాలను అడ్మిట్‌కార్డ్‌లో తెలియజేస్తారు. మెయిన్స్ ఎగ్జామ్‌ను స్టూడియో సెటప్ ఫార్మాట్‌లో నిర్వహిస్తారు. ఇందులో మల్టిపుల్ టెస్టులు ఉంటాయి. ప్రిలిమ్స్ స్కోర్‌కు 40 శాతం, మెయిన్స్ స్కోర్‌కు 60 శాతం వెయిటేజీ ఇస్తారు.

- ▲ **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఈడబ్ల్యూఎస్, ఓబీసీ అభ్యర్థులకు రూ.3,000; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.1500; విదేశీ విద్యార్థులకు రూ.5,000
- ▲ **దరఖాస్తుకు చివరి తేదీ:** డిసెంబరు 3
- ▲ **ఎడిట్ విండో ఓపెన్:** డిసెంబరు 4 నుంచి 9
- ▲ **ప్రిలిమ్స్ అడ్మిట్ కార్డ్‌ల డౌన్‌లోడింగ్:** డిసెంబరు 24 నుంచి
- ▲ **పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, విజయవాడ
- ▲ **ప్రిలిమ్స్ తేదీ:** 2025 జనవరి 5న
- ▲ **ప్రిలిమ్స్ ఫలితాలు విడుదల:** బీ డిజైన్‌కు 2025 ఏప్రిల్ 1న.
- ▲ **వెబ్‌సైట్:** admissions.nid.edu

Tata Capital Pankh Scholarship Program

Description: An initiative of Tata Capital Limited aimed at providing financial support to students belonging to economically weaker sections of society to help them fulfill their academic dreams.

Eligibility: Indian students who are currently studying in Classes 11, 12 general graduation (B.Com., B.Sc., B.A., etc.), diploma and ITI courses at recognised institutions are eligible. Applicants must have scored at least 60% marks in the preceding class. The annual family income of the applicants from all sources must be less than or equal to INR 2.5 lakh.

Prizes & Rewards: Up to an amount ranging from INR 10,000 to INR 12,000 or 80% of course fees (whichever is less)

Last Date to Apply: 15-10-2024. ***Application mode:*** Online applications only.

Short Url: ww.b4s.in/aj/TCPS27

Santoor Scholarship Programme

Description: Santoor Scholarship Programme 2024-25 aims to support the undergraduate studies of young women from disadvantaged backgrounds in the states of Andhra Pradesh, Karnataka, Telangana or Chhattisgarh.

Eligibility: Open to young women from underprivileged backgrounds residing in Andhra Pradesh, Karnataka, Telangana, and Chhattisgarh.

Applicants must have: passed Class 10 from a local government school. passed Class 12 from a government school or junior college in the academic year 2023-24. And enrolled in a full-time graduate programme starting in 2024-25.

Note:
- The full-time graduate course must have a minimum duration of 3 years.
- Students with a strong interest in pursuing higher education in humanities, liberal arts, and sciences, are strongly encouraged to apply.
- Priority will also be given to students from aspirational (backward) districts.

Prizes & Rewards: INR 24,000 per annum

Last Date to Apply: 15-10-2024

Application mode: Online applications only! Students can apply online at Buddy4study or download the application form from www.santoorscholarship.com.

Short Url: www.b4s.in/aj/SWS7

SCHOLARSHIP ALERT

Sensodyne IDA Shining Star Scholarship Programme 2024-25

Description: Haleon India, makers of Sensodyne, invites applications for the 'Sensodyne IDA Shining Star Scholarship Programme 2024-25' to support meritorious and underprivileged BDS students across India.

Eligibility:
- Open to students pursuing their first year of the Bachelor of Dental Surgery (BDS) programme from government and government-funded colleges only.
- Applicants must have scored a minimum of 60% in their Higher Secondary Education.
- Successful applicants must maintain a 60% score in every semester/year to continue availing of the benefits during their 4-year course.
- The annual family income of the applicant from all sources must not be more than INR 8,00,000.

Prizes & Rewards: INR 4,20,000 for 4 years (INR 1,05,000 per year)

Last Date to Apply: 31-10-2024

Application mode: Online applications only

Short Url: www.b4s.in/aj/SSPPS4

buddy4study.com

నవ్య | చిత్రజ్యోతి

క్రైమ్ క్యాన్సర్ లాంటిది.. పెరగనివ్వకూడదు

'వారంలో ఎన్‌కౌంటర్ జరిగిపోవాలి' అని రావు రమేశ్ అనగానే 'వారం అక్కర్లేదు.. మూడే రోజుల్లో డిపార్ట్‌మెంట్‌కు మంచి పేరొస్తుంది' అంటూ స్టయిలిష్ నడకతో ఎంట్రీ ఇచ్చారు రజనీకాంత్. ఆయన హీరోగా నటించిన 'వేట్టయన్.. ద హంటర్' సినిమా ఈ నెల పదిన విడుదల కానుంది. ఈ నేపథ్యంలో బుధవారం విడుదల చేసిన ట్రైలర్ ఆకట్టుకుంటోంది. అలాగే అమితాబ్, రానా, ఫాహద్ ఫాజిల్ పాత్రల్ని కూడా ఈ ట్రైలర్‌లో పరిచయం చేశారు. 'క్రైమ్ అనేది క్యాన్సర్ లాంటిది. దానిని పెరగనివ్వకూడదు' వంటి డైలాగులు, అద్భుతమైన విజువల్స్ అలరిస్తున్నాయి. 'నన్ను ఏ పోస్టులో తిప్పి కొట్టినా నేను మాత్రం పోలీస్ వాడినే సార్.. నా నుంచి వాడిని కాపాడడం ఎవరి వల్లా కాదు' అంటూ రజనీకాంత్ డైనమిక్‌గా చెప్పే డైలాగ్ ఈ సినిమా మీద అంచనాలు పెంచేసింది. మంజు వారియర్, రోహిణి, అభిరామి, రితికా సింగ్ ఇతర ముఖ్య పాత్రలు పోషించిన ఈ సినిమాను టీజే జ్ఞానవేల్ దర్శకత్వంలో సుభాస్కరన్ నిర్మించారు.



కోలుకుంటున్న రజనీకాంత్

● ఆయన ఆరోగ్యంపై ప్రధాని ఆరా

తీవ్ర అస్వస్థతకు గురై చెన్నై నగరంలోని అపోలో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తమిళ సూపర్‌స్టార్ రజనీకాంత్ క్రమంగా కోలుకుంటున్నారు. గురువారం డిశ్చార్జ్ అయ్యే అవకాశముందని ఆసుపత్రివర్గాలు వెల్లడించాయి. ఇంటికి చేరిన తర్వాత ఆయన వారం రోజుల పాటు విశ్రాంతి తీసుకోవాల్సివుంటుందని ఆ వర్గాలు పేర్కొన్నాయి. ఇదిలావుండగా.. ప్రధానమంత్రి నరేంద్రమోదీ రజనీ ఆరోగ్యం గురించి ఆయన సతీమణి లతా రజనీకాంత్‌కు ఫోన్ చేసి వాకబు చేశారు.

- చెన్నై(ఆంధ్రజ్యోతి)



నాని పక్కన కేజీఎఫ్ భామ

నాని నటిస్తున్న 32వ సినిమా 'హిట్.. ద థర్డ్ కేస్'. డాక్టర్ శైలేష్ కొలను దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో కేజీఎఫ్ భామ శ్రీనిధి శెట్టి నటిస్తోంది. సినిమాలో ఆమె పాత్రకు ఎంతో ప్రాధాన్యం ఉందని దర్శకుడు చెప్పారు. ప్రస్తుతం వైజాగ్‌లో జరుగుతున్న షూటింగ్‌లో శ్రీనిధి జాయిన్ అయింది. నాని, శ్రీనిధిపై కీలకమైన సన్నివేశాలు చిత్రీకరిస్తున్నారు. వచ్చే ఏడాది మే ఒకటిన విడుదలయ్యే ఈ సినిమాను ప్రశాంతి తిపిర్నేని నిర్మిస్తున్నారు.

శ్వాగ్ లాంటి సినిమా తీయడం కష్టం



'రాజ రాజ చోర' ఫేమ్ హసిత్ గోలి దర్శకత్వంలో శ్రీవిష్ణు, రీతూ వర్మ నటించిన చిత్రం 'శ్వాగ్'. టీ.జీ.విశ్వప్రసాద్ నిర్మించారు. ఈ శుక్రవారం సినిమా విడుదలవుతున్న సందర్భంగా చిత్ర బృందం ప్రీ రిలీజ్ వేడుక నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీవిష్ణు మాట్లాడుతూ "ఇది చాలా పెద్ద కథ. ఇలాంటి కథను తెరకెక్కించడం అంత ఈజీ ఏం కాదు. ఇందులో నాలుగు పాత్రలు పోషించాను. హసిత్ ఈ సినిమాను చాలా బాగా హ్యాండిల్ చేశారు" అని చెప్పారు. "గూఢచారి', 'బేబీ' 'కార్తికేయ' వంటి సినిమాల్లా.. మార్కెట్ కంటే ఎక్కువ స్పాన్ ఉన్న చిత్రం 'శ్వాగ్'. కచ్చితంగా ఘనవిజయం సాధిస్తుందన్న నమ్మకం ఉంది" అని నిర్మాత టీ.జీ.విశ్వప్రసాద్ అన్నారు. "నిర్మాత విశ్వప్రసాద్ మేకింగ్ విషయంలో పూర్తి స్వేచ్ఛనిచ్చారు. శ్రీవిష్ణు కథను హీరోగా భావించే సినిమా చేసే గొప్ప నటుడు" అని డైరెక్టర్ హసిత్‌గోలి చెప్పారు. "ఇందులోని ప్రతీ పాత్ర కొత్తగా ఉంటుంది. సినిమా అందర్నీ ఆకట్టుకుంటుంది" అని హీరోయిన్ రీతూ వర్మ తెలిపారు.

'గాంధీ' కోసం రెహమాన్ సంగీతం



బాలీవుడ్ డైరెక్టర్ హన్సల్ మెహతా దర్శకత్వంలో మహాత్ముడి జీవితం ఆధారంగా 'గాంధీ' సిరీస్ తెరకెక్కుతోంది. గాంధీ జయంతి సందర్భంగా ఈ సినిమాకు సంబంధించిన ఓ కీలక అప్‌డేట్‌ను చిత్రబృందం షేర్ చేసుకుంది. ఈ సినిమాకు ఏ.ఆర్.రెహమాన్ సంగీతం అందిస్తున్నారని ప్రకటించింది. ఈ సందర్భంగా రెహమాన్ మాట్లాడుతూ 'దేశానికి స్వాతంత్ర్యం తెచ్చిన గాంధీ జీవిత కథను ఈ సిరీస్ స్ఫూర్తిదాయక రీతిలో ప్రజెంట్ చేస్తుంది. అటువంటి గొప్ప పోరాట యోధుడి బయోపిక్‌కు సంగీతం అందించటం ఆనందంగా ఉంది" అని అన్నారు. ప్రముఖ చరిత్రకారుడు రామచంద్రన్ గుహ రాసిన 'గాంధీ బిఫోర్ ఇండియా' పుస్తకం ఆధారంగా ఈ సిరీస్ తెరకెక్కుతోంది. అప్లాజ్ ఎంటర్టైన్‌మెంట్స్ నిర్మిస్తోంది.

ఇన్ ప్రోగ్రెస్

విలన్ ఎవరనేది సస్పెన్స్



'మిస్టర్ సెలెబ్రిటీ' చిత్రంతో పరుచూరి వెంకటేశ్వరరావు మనవడు సుదర్శన్ హీరోగా పరిచయమవుతున్నారు. రవికిశోర్ దర్శకత్వంలో చిన్న రెడ్డయ్య, ఎన్. పాండురంగారావు ఈ సినిమాను నిర్మించారు. ఈ నెల నాలుగున విడుదలవుతున్న ఈ సినిమా ట్రైలర్‌ను రానా విడుదల చేసి, సుదర్శన్‌కు అభినందనలు తెలిపారు. సస్పెన్స్ జానర్‌లో రూపుదిద్దుకున్న ఈ సినిమాలో విలన్ ఎవరన్నది తెలియకుండా ట్రైలర్‌ను కట్ చేసిన విధానం దర్శకుని ప్రతిభను విదితం చేసింది. వరలక్ష్మి శరత్‌కుమార్, శ్రీదీక్ష, నాజర్, రఘుబాబు తదితరులు నటించారు.

ప్రేక్షకులు మెచ్చే ప్రేమకథ



శ్రీనివాస్ మహత్ దర్శకత్వంలో చంద్రహాస్ హీరోగా నటించిన చిత్రం 'రామ్‌నగర్ బన్నీ'. మలయజ ప్రభాకర్, ప్రభాకర్ పొడకండ నిర్మిస్తున్నారు. ఈ నెల 4న విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్రబృందం నిర్వహించిన ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు రామ్‌గోపాల్ వర్మ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. 'రామ్‌నగర్ బన్నీ' ప్రచార చిత్రాలతో సినిమాపై ఆసక్తి పెరిగింది. చంద్రహాస్ హీరోగా మంచి గుర్తింపు తెచ్చుకోవాలి' అని ఆకాంక్షించారు. మా టీం అంతా ఈ సినిమా కోసం చాలా కష్టపడ్డారు అని దర్శకుడు చెప్పారు. ప్రేక్షకులు 'రామ్‌నగర్ బన్నీ' చిత్రాన్ని ఆదరించాలని ప్రభాకర్ కోరారు. ప్రేక్షకులను ఆకట్టుకునే వినోదంతో పాటు మంచి ప్రేమకథ ఉన్న చిత్రమిది, ప్రేక్షకులను మెప్పిస్తుందని చంద్రహాస్ చెప్పారు.

దీక్ష.. పట్టుదల



కిరణ్‌కుమార్, అలేఖ్యా రెడ్డి జంటగా నటించిన 'దీక్ష' చిత్రం పోస్ట్ ప్రొడక్షన్ దశలో ఉంది. తెలంగాణ ఫిల్మ్ ఛాంబర్ అధ్యక్షుడు ప్రతాని రామకృష్ణగౌడ్ దర్శకత్వంలో పినిశెట్టి అశోక్‌కుమార్ నిర్మిస్తున్నారు. 'దీక్ష, పట్టుదల ఉంటే ఏదైనా సాధించగలం అనే పాయింట్‌తో చిత్రాన్ని తీశాం. హీరోగా కిరణ్‌కు ఎంతో పేరు తెచ్చే సినిమా ఇది. రాజ్‌కిరణ్ స్వరపరిచిన పాటలు ఆకట్టుకుంటాయి. మంచి కంటెంట్‌తో రూపొందిన ఈ సినమా అందరినీ ఆకట్టుకుంటుంది. మా నిర్మాత అశోక్‌కుమార్‌గారు వెనుకుండి మమ్మల్ని నడిపిస్తున్నారు' అని చెప్పారు సినిమాలో ఐటెం సాంగ్ చేసిన అక్సాఖాన్ మాట్లాడుతూ 'ఇందులో అవకాశం ఇచ్చిన దర్శకనిర్మాతలకు కృతజ్ఞతలు. ఈ సినిమాతో పాటు 16 భాషల్లో వస్తున్న 'మహిళా కబడ్డీ' సినిమాలోనూ ఆర్ కె గౌడ్ అవకాశం ఇచ్చారు' అని తెలిపారు.

ట్వల్త్ ఫెయిల్‌కు ప్రీక్వెల్



విధువినోద్ చోప్రా దర్శకత్వంలో తెరకెక్కిన 'ట్వల్త్ ఫెయిల్' బయోపిక్ ప్రేక్షకుల నుంచి ఎంతటి ఆదరాభిమానాలను అందుకుందో తెలిసిందే. విక్రాంత్ మస్సే ఇందులో ఐ.ఏ.ఎస్ ఆఫీసర్ మనోజ్ కుమార్ శర్మగా.. కనిపించి అందరినీ ఆకట్టుకున్నారు. తాజాగా, జరిగిన ఓ మీడియా సమావేశంలో.. 'ట్వల్త్ ఫెయిల్' సినిమాకు ప్రీక్వెల్‌గా తెరకెక్కుతోన్న 'జీరో సే రీస్టార్ట్' సినిమాను డిసెంబరు 13న విడుదల చేయనున్నట్లు విధువినోద్ చోప్రా ప్రకటించారు. "మొదటి భాగంలో ఉన్న నటీనటులే ఇందులోనూ కొనసాగుతారు. ఈ ప్రీక్వెల్ కథానాయకుడి బ్యాక్ స్టోరీపై ఫోకస్ చేస్తుంది. ఇందులో మనోజ్ కుమార్ జీవితాన్ని మార్చేసిన సంఘటనలను ఆసక్తికరంగా చూపించనున్నాం" అని చెప్పారు.

ఆ నేపథ్యంలో ఎవరూ చేయని సినిమా



'కరోనా సమయంలో ఆత్మహత్యలు చేసుకొనే వారి సంఖ్య పెరిగింది. అలాంటి ప్రయత్నం చేసినప్పుడు ఎవరైనా అడ్డుకుని వారిని ఆ ఆలోచనకు దూరం చేస్తే బాగుంటుంది.. అనే పాయింట్‌తో దర్శకుడు శివశేష రాసుకున్న కథ విన్నప్పుడు నాకు కొత్తగా అనిపించింది. ఇలాంటి నేపథ్యంలో ఎవరూ సినిమా చేయలేదనిపించి, నా సమర్పణలో 'కలి' చిత్రాన్ని నిర్మించాం' అన్నారు సీనియర్ జర్నలిస్టు రాఘవేంద్రరెడ్డి. ప్రిన్స్, నరేశ్ అగస్త్య హీరోలుగా నటించిన 'కలి' చిత్రం ఈ నెల నాలుగున విడుదల కానుంది. లీలా గౌతమ్ నిర్మాత. ఈ నేపథ్యంలో రాఘవేంద్రరెడ్డి చిత్ర విశేషాలను మీడియాకు వెల్లడిస్తూ 'శివరామ్ అనే మంచి వ్యక్తి తన జీవితంలో ఎదురైన కొన్ని ఇబ్బందుల వల్ల ఆత్మహత్య చేసుకోవాలని అనుకుంటాడు. ఆ సమయంలో ఒక అపరిచిత వ్యక్తి అతని ఇంటికి వస్తాడు. ఆతని రాకతో శివరామ్ జీవితం ఎలా మారింది అనేది 'కలి' కథ. ఎలాంటి సందేశాలు, ఉపోద్ఘాతాలు లేకుండా సినిమా తీశాం. నిర్మాణపరంగా ఎక్కడా రాజీపడలేదు.. ఇందులో బల్లి పాత్రకు ప్రియదర్శి, గోడ గడియారంకు అయ్యప్ప పి.శర్మ డబ్బింగ్ చెప్పారు' అని చెప్పారు రాఘవేంద్రరెడ్డి. దర్శకుడు శివ శేష ప్రతిభావంతుడనీ, పురాణాల మీద మంచి పట్టు ఉందని తెలిపారు. సినిమా మేకింగ్ మీద ప్యాషన్‌తో లీలా గౌతమ్ వర్మ నిర్మాణరంగంలోకి వచ్చారనీ, నిర్మాతగా అతనికి మంచి భవిష్యత్ ఉంటుందని రాఘవేంద్రరెడ్డి చెప్పారు.

నీటి సంఘాలకు ఎన్నికలు

- సన్నాహాలు ప్రారంభించిన ప్రభుత్వం
- గత ఐదేళ్లుగా పట్టించుకోని జగన్ సర్కారు
- చిన్న, మధ్యతరహా సాగునీటి వనరులు నిర్లక్ష్యం


విజయనగరం (ఆంధ్రజ్యోతి): సాగునీటి సంఘాల ఎన్నికలకు ప్రభుత్వం తీవ్రంగా కసరత్తు చేస్తోంది. మంత్రి నిమ్మల రామానాయుడు ఇటీవల ఎన్నికల విషయంలో స్పష్టతనిచ్చారు. చిన్న, మధ్యతరహా సాగు నీటి వనరులపై దృష్టిపెట్టిన నేపథ్యంలో ఎన్నికలు అనివార్యమని చెప్పుకొచ్చారు. ఇప్పటికే దీనిపై అన్ని జిల్లాల యంత్రాంగాలకు పరోక్ష సంకేతాలు ఇచ్చినట్టు చెప్పుకొచ్చారు. మరోవైపు జిల్లాలో ఇరిగేషన్ శాఖ ఎన్నికల నిర్వహణకు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలుస్తోంది. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో నీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించలేదు. ప్రత్యేకాధికారుల పాలనతోనే నెట్టుకొచ్చారు. కనీస స్థాయిలో కూడా ఇరిగేషన్‌కు కేటాయింపులు లేవు. పెద్ద ప్రాజెక్టులకు బడ్జెట్‌లో నిధుల కేటాయింపు తప్ప.. విడుదల చేసిన దాఖలాలు కూడా లేవు. దీంతో రైతుల బాధలు వర్ణనాతీతం.

● **టీడీపీ ప్రాధాన్యం..**

టీడీపీ ప్రభుత్వ హయాంలో నీటి సంఘాల ఎన్నికలకు అత్యంత ప్రాధాన్యం ఇచ్చారు. పాలకవర్గాల గడువు ముగిసిన వెంటనే ఎన్నికలు నిర్వహించేవారు. వైసీపీ ప్రభుత్వం మాత్రం కాలయాపన చేసిందే తప్ప ఎన్నికలు మాత్రం నిర్వహించలేదు. ఆయకట్టు పరిధిలోని సాగునీటి సమస్యలు పరిష్కారం కాక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. చంద్రబాబు, వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, కిరణ్‌కుమార్ రెడ్డి హయాంలో నీటి సంఘాల పాత్ర కీలకంగా ఉండేవి. ఏటా ఖరీఫ్, రబీకి ముందు నీటి సంఘాల ఆధ్వర్యంలో రైతులతో గ్రామసభ నిర్వహించేవారు. చెరువులు, కాలువల అభివృద్ధి పనులను గుర్తించేవారు. రైతుల నుంచి అభిప్రాయాలు సేకరించేవారు. ప్రతిపాదనలు రూపొందించి ఇరిగేషన్ అధికారుల ద్వారా ప్రభుత్వానికి నివేదించేవారు. దానికి అనుగుణంగా ప్రభుత్వం నిధులు మంజూరు చేసేది. యుద్ధ ప్రాతిపదికన పనులు చేసేవారు. కానీ గత ఐదేళ్లుగా ఆ పరిస్థితే లేదు. ప్రస్తుతానికి సంఘం స్థాయిని బట్టి ఏఈఈ, జేఈఈ, డీఈఈ, ఎస్ఈ స్థాయి అధికారులు ప్రత్యేకాధికారులుగా వ్యవహరిస్తున్నారు.

● **జిల్లాలో ఇదీ పరిస్థితి..**

జిల్లాలో 431 సాగునీటి సంఘాలు ఉన్నాయి. వెంగళరాయసాగర్, పెద్దగెడ్డ, ఒట్టిగెడ్డ, పెద్దలంకాం, తాటిపూడి, ఆంధ్ర, డెంకాడ ప్రాజెక్టు కమిటీలు ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా వేలాది చెరువులు వీటి పరిధిలో ఉన్నాయి. చెరువుల్లో పూడికతీత, మదుములు, తూముల నిర్మాణం, మరమ్మతు పనులు, కాలువ విస్తరణ, జంగిల్ క్లియరెన్స్ వంటి పనులు నీటి సంఘాలు చేపట్టేవి. కానీ దాదాపు వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వీటి కార్యకలాపాలు నిలిచిపోయాయి. కనీసం వీటిని పట్టించుకున్న దాఖలాలు లేవు. ఇప్పుడు కూటమి ప్రభుత్వంపైనే రైతులు ఆశలు పెట్టుకున్నారు. వాస్తవానికి సాగునీటి సంఘాలకు స్థానిక సంస్థల నుంచి నిధులు సమకూరుతాయి. రైతులు ఏటా చెల్లించే నీటి పన్నులు నీటి సంఘాల ఖాతాలకు జమ అయ్యేవి. వాటికి తోడు ప్రభుత్వం ప్రత్యేక నిధులు జోడించి విడుదల చేసేవి. గత ప్రభుత్వాల హయాంలో నీటి సంఘాలకు నిధులు పుష్కలంగా విడుదలయ్యేవి. రైతులకు అవసరమయ్యే పనులు శరవేగంగా పూర్తయ్యేవి. ఎన్నికలు కూడా రాజకీయాలకతీతంగా



పారదర్శకంగా జరిగాయి. క్రియాశీలకంగా ఉండే రైతు ప్రతినిధులను ఎన్నుకునేవారు. భూమి కలిగి, పట్టాదారు పాసుపుస్తకం ఉన్న రైతులను ఓటర్లుగా చేర్చేవారు. మేజర్, మీడియం, మైనర్ సాగునీటి సంఘాలుగా విభజించి టీసీ మెంబర్లను ఎన్నుకునేవారు. వారిలో ఒకరు సంఘ అధ్యక్షుడిగా వ్యవహరించేవారు. నిధుల విడుదలలో పారదర్శకత పాటించేందుకు ఉమ్మడి అకౌంట్ ఉండేది. ఎం.బుక్ ప్రాప్తికి పనులు పూర్తయిన వెంటనే బిల్లుల చెల్లింపు జరిగేది. యంత్రాల సాయంతో రైతుకు అవసరమైన పనులు చేపట్టే వారు. గత ఐదేళ్లుగా ఎటువంటి పనులు లేవు. ఎన్నికలపై కూటమి ప్రభుత్వం ప్రకటన చేయడంతో ఇప్పుడు మళ్లీ ఆశలు చిగురిస్తున్నాయి.

జ్వరంతో గిరిజన విద్యార్థిని మృతి

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని పి.ఆమిటి గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న కుక్కిడి శివడ గ్రామానికి చెందిన నిమ్మల అవంతిక (13) పార్వతీపురం ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందింది. బంధువుల కథనం మేరకు.. అవంతికకు గత నెల 28న జ్వరం రావడంతో పాఠశా ల హెడ్మాస్టర్, డిప్యూటీ వార్డెన్ భద్రగిరి సామాజిక ఆరో గ్య కేంద్రానికి తీసుకెళ్లారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం పార్వతీపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. . హిమోగ్లోబిన్ శాతం నాలుగుకు పడిపోవడం, ప్లేట్‌లెట్లు కూడా తగ్గిపోయాయి. దీంతో వైద్యులు చికిత్స అందించినా ఫలితం లేకపోవడంతో అవంతిక మంగళవారం రా త్రి మృతి చెందింది. మృతదేహాన్ని కె.శివడ గ్రామానికి తీసుకొచ్చారు. అవంతిక మృతితో తల్లిదం డ్రులు బాబూరావు, కుటుంబ సభ్యులు, గ్రామస్థులు విషాదంలో మునిగిపోయారు.

జాగ్గాపురంలో వ్యక్తి ఆత్మహత్య

గంట్యాడ: మనస్తాపానికి గురై వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలో చోటు చేసుకుంది. దీనికి సంబంధించి పోలీసులు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. జాగ్గాపురం గ్రామానికి చెందిన మొయిద అప్పలనాయుడు(42)కు విజయనగరం మండలం మరిచర్ల గ్రామానికి చెందిన పద్మతో గత కొన్ని సంవత్సరాల క్రితం వివాహమైంది. వారి కాపురం సజావు సాగుతున్న తరుణంలో అప్పలనాయుడుకు ఉన్న అక్రమ సంబంధంపై కుటుంబ సభ్యులు మంగళవారం ప్రశ్నించడంతో ఆయన మనస్తాపానికి గురై ఇంటిలో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. మృతుడి భార్య పద్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సాయి కృష్ణ తెలిపారు.

బైక్-ట్రాక్టర్ ఢీ.. వ్యక్తికి గాయాలు

బాడంగి: పినపెంకి నుంచి బొబ్బిలి వైపు వెళ్తున్న బైక్‌ను బొబ్బిలి నుంచి పినపెంకి వైపు వస్తున్న ట్రాక్టర్ ఢీకొట్టింది. ఈ ఘటనలో బైక్‌పై వస్తున్న ఎద్దు వాసుకు తీవ్ర గాయాలయ్యాయి. ఏఎస్ఐ కొండలరావు అందించిన సమాచారం ప్రకారం బొబ్బిలి మండలం మెట్టవలసకు చెందిన ఎద్దువాసు పెయింటింగ్ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం మధ్యాహ్నం అమ్మమ్మ ఇంటికి పినపెంకి వెళ్తుండగా రాత్రి సుమారు 7 గంటల సమయంలో ట్రాక్టర్ ఢీకొనడంతో తీవ్ర గాయాలవ్వడంతో అక్కడి నుంచి రాజాం కేర్ ఆసుపత్రికి తరలించారు. వాసు అపస్మారక స్థితిలో చేరుకోవడంతో తండ్రి వీరయ్య బుధవారం సాయంత్రం బాడంగి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఏఎస్ఐ కొండలరావు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

మద్యం సీసాలతో పట్టుబడ్డ వ్యక్తి అరెస్టు

బొబ్బిలి: పట్టణంలోని దిబ్బవీధికి చెందిన వేగి సూరిబాబు 242 మద్యం సీసాలతో మంగళవారం అర్ధరాత్రి సమయంలో పట్టుబడినట్లు ఎస్ఐ ఆర్.రమేష్ తెలిపారు. స్థానిక దాడితల్లి అమ్మవారి ఆలయ జంక్షన్‌లో సీఐ కటకం సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు నిఘా వేసి ఉండగా మోటారు సైకిల్‌పై 37,200 రూపాయల విలువ చేసే మద్యం సీసాలను సూరిబాబు తరలిస్తుండగా పట్టుకున్నామని ఆయన తెలిపారు. వాహనాన్ని, మద్యం సీసాలను సీజ్ చేసి నిందితుని అరెస్టు చేసి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రమేష్ వివరించారు.

వ్యక్తిపై కత్తితో దాడి

బొబ్బిలి: బొబ్బిలి పట్టణ పరిధిలో మెహెర్‌కాలనీలో ఇంట్లో అద్దెకు ఉంటున్న దంపతులపై ఇంటి యజమాని కత్తితో దాడి చేసి గాయపరిచాడు. దీనికి సంబంధించి సీఐ కటకం సతీష్‌కుమార్ తెలిపారు. ఈ కేసు వివరాలను ఇలా వివరించారు. యామల గణేశ్‌నాయుడు ఇంట్లో సుమారు పదేళ్ల నుంచి 4.50 లక్షల రూపాయలను చెల్లించి బోగబంధం అగ్రిమెంట్‌పై వంగపండు సత్యనారాయణ నివాసం ఉంటున్నాడు. ఈ బోగబంధం డబ్బులను చెల్లించకుండానే గణేశ్‌నాయుడు తన ఇంటిని పెద్దింటి గోపాలం అనే వ్యక్తికి అమ్మేశాడు. ఇంటిపై ఇచ్చిన బోగ బంధం సొమ్ముకు ప్రామిషరీ నోటును కలిగి ఉన్న సత్యనారాయణ స్థానిక కోర్టులో కేసు వేశారు. దీనిపై కోర్టు స్పందించి ఇంటి లావాదేవీలకు సంబంధించి బుధవారం మధ్యాహ్నం దండోరా వేయించారు. ఈ అంశాన్ని జీర్ణించుకోలేని గణేశ్‌నాయుడు కత్తితో వంగపండు సత్యనారాయణపై బుధవారం సాయంత్రం దాడి చేసి గాయ పరిచాడు. బాధితుడి భార్య పార్వతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితుని అదుపులోనికి తీసుకున్నామని సీఐ తెలిపారు. గాయపడ్డ సత్యనారాయణ స్థానిక సీహెచ్‌సీలో చికిత్స పొందుతున్నాడని, కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

జొన్నాడ టోల్‌గేట్ వద్ద వివాదం

● వాహనదారులపై దాడికి పాల్పడ్డ సిబ్బంది

డెంకాడ, అక్టోబరు 2: మండలంలోని జొన్నాడ సమీపంలో గల టోల్ ప్లాజా నిర్వాహకులపై నిత్యం పలు ఆరోపణలు వస్తున్నాయి. వాహనదారులతో దురుసుగా ప్రవర్తిస్తున్నారన్న ఫిర్యాదులకు బుధవారం జరిగిన ఘటన మరింత బలం చేకూర్చింది. బుధవారం సాయంత్రం విశాఖ నుంచి విజయనగరం వస్తున్న ఓ వాహనం టోల్‌గేట్ దగ్గర ఆగింది. ఆ వాహనం దగ్గరికి వెళ్లిన టోల్‌గేట్ సిబ్బంది వారితో గొడవపడి వాహనంలో ఉన్న డ్రైవర్ సంతోష్‌కుమార్, సురేష్‌పై కర్రలు, రాడ్డులతో దాడి చేసి గాయపరిచారు. ఈ ఘటనలో గాయపడిన డ్రైవర్లను స్థానికులు జిల్లా కేంద్రాసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. దీనిపై విశాఖపట్నం జిల్లా భీమిలి పోలీస్ స్టేషన్‌లో దర్యాప్తు చేపడుతున్నట్లు సమాచారం.

ఆటోబోల్తా పడి తొమ్మిది మందికి గాయాలు

పాలకొండ: పట్టణంలోని చెక్‌పోస్టు జంక్షన్ వద్ద ఆటో బుధవారం బోల్తాపడడంతో శ్రీకాకుళం జిల్లాలోని బూర్జ మండలంలో గల డొంకలపర్త గ్రామానికి చెందినతొమ్మిది మందికి గాయాలయ్యాయి. 108 సాయంతో స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఇందులో ఒకరి పరిస్థితి విషమంగా ఉండడంతో శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కూలిన ఇంటిపై కప్పు

బొబ్బిలి రూరల్: మండలంలోని కమ్మవలస సచివాలయ పరిధి, ముత్తాయవలస గ్రామం, ఎస్సీ కాలనీలో మంగళవారం ఎచ్చెర్ల అప్పన్న ఇంటి పైకప్పు కూలిపోయిందని జిల్లా దళిత నాయకుడు గంట సురేష్ మీడియాకు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తక్షణమే సంబంధిత అధికారులు స్పందించి ప్రభుత్వం తగిన సహాయం చేయాలని బుధవారం కోరారు.

ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణ ఆపాలి

బెలగాం: విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ప్రతి ఒక్కరూ ఉద్యమించాలని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ, వామ పక్షాల ట్రేడ్ యూనియన్ల నాయకులు పిలుపునిచ్చారు. బుధవారం పట్టణంలోని ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణ ఆపాలని కలెక్టరేట్ వద్ద నిరసన దీక్ష చేశారు. కార్య క్రమంలో ఏఐటీయూసీ నాయకులు ఆర్వీఎస్ కుమార్, విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటి, వామ పక్షాల ట్రేడ్ యూనియన్ల నాయకులు వై.మన్మధరావు, రమణ, దుర్గారావు, ఈవీ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే వినతుల స్వీకరణ

విజయనగరం రూరల్: విజయనగరం నియోజకవర్గ శాసనసభ్యురాలు అదితి గజపతిరాజు రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు నగర పరిధిలోని 13వ డివిజన్‌లో సచివాలయం వద్ద గురువారం ప్రజా సమస్యలపై వినతులు స్వీకరించనున్నారు. 1 వ డివిజన్ నుంచి 15 డివిజన్‌ల వరకూ ఆయా ప్రాంతాల్లో ఉన్న సమస్యలను తెలియజేసేందుకు 13వ డివిజన్ టీడీపీ ఇన్‌చార్జి చందక స్వప్న యాదవ్, డివిజన్ టీడీపీ కమిటీ ఏర్పాట్లు చేస్తోంది.

జేఎన్‌టీయూ ఆధ్వర్యంలో ఆహార పంపిణీ

విజయనగరం రూరల్: జేఎన్‌టీయూ సమాచార, సాంకేతిక విభాగం ఆధ్వర్యంలో నవజీవన ఆర్ఫికాశ్రమంలో ఆహార పంపిణీ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. వైస్ చాన్సలర్ రాజ్యలక్ష్మి, ఆశాఖ ప్రధానాచార్యులు బిందుమాధురి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఇటువంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం సమాజానికి ఎంతో అవసరమని ఇవి మనకు బాధ్యతను నేర్పిస్తాయన్నారు. సంస్థ సభ్యులు వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

సీపీఎస్ రద్దు చేయాలి

బెలగాం: సీపీఎస్ రద్దు చేయాలని పీఆర్‌టీయూ నాయకులు కోరారు. బుధవారం పార్వతీపురంలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో పీఆర్‌టీయూ ప్రాంతీయ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ నాయకులు అమరపు సూర్యనారాయణ, కాగాన విజయ్, భోగి రవికుమార్, జక్కు రామినాయుడు, గుల్ల రామి నాయుడు పాల్గొన్నారు.

పేదలకు బియ్యం పంపిణీ

లక్కవరపుకోట: మండలంలో రేగ గ్రామంలోని శ్రీ గాయత్రి వెల్ఫేర్ అసోషియేషన్ ఆధ్వర్యంలో గ్రామంలో పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. సంస్థ వార్షికోత్సవం బుధవారం పేదలకు ఉచితంగా బియ్యం పంపిణీ చేశారు. గాయత్రి ఆలయ పెద్దలకు, గ్రామ పెద్దలకు సన్మానం చేశారు. గ్రామ నలుమూలలా రేగ పేరుతో ఉన్న ఇనుప బోర్డులను ఏర్పాటు చేశారు. భవానీ మాల ధారణ, అయ్యప్ప భక్తుల స్నానాలకు ఏర్పాట్లు చేస్తున్నారు. పాఠశాలలో సుమారు 250మంది పేద విద్యార్థులకు నోటుపుస్తకాలు, పెన్నులు అందించారు. వివిధ ప్రాంతాల్లో ఉన్న అసోషియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

మహిళలకు చీరల పంపిణీ

బొబ్బిలి రూరల్: బొబ్బిలి ఇందిరమ్మ కాలనీ, యానాదుల వీధిలో బుధవారం గాంధీ జయంతి సందర్భంగా వనమిత్ర కృష్ణదాస్ పిల్లలకు గాంధీ చిత్ర పటాన్ని బహూకరిస్తూ మహాత్మగాంధీ గురించి పిల్లలకు తెలియజేశారు. అనంతరం పేద వృద్ధులకు, మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాలు కూడా వృద్ధుల శ్రేయస్సు కోసం, హక్కుల కోసం అనేకమైన చట్టాలను రూపొందించిందని, సామాజిక వేత్తలు కూడా స్పందించి పేద వృద్ధులకు సహాయం చేయాలని తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

బొబ్బిలి: బొబ్బిలి విద్యుత్ డివిజన్ పరిధిలో 33 కేవీ మక్కువ ఫీడరు పరిధిలో గురువారం నిర్వహణా పనులు చేపట్టనున్నందున విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఈఈ ఆవాల అనంతరావు తెలిపారు. నార సింహునిపేట సబ్‌స్టేషన్ పరిధిలో గల గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు నిలిచిపోతుందని వినియోగదారులంతా తమకు సహకరించాలని ఆయన ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

ఇసుక లభించేలా చర్యలు తీసుకోవాలి

పాలకొండ: రాష్ట్ర ప్రభుత్వం అందరికీ ఉచితంగా ఇసుక లభించే విధంగా చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణుతో పాటు ఎం.తిరుపతిరావు, డి.రమణారావు కోరారు. బుధవారం పాలకొండలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఉచిత ఇసుక హామీని తక్షణమే అమలు చేయాలని కోరారు. భవన నిర్మాణ కార్మికులను ఉపాధి కల్పించాలని శుక్రవారం కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నా జయప్రదం చేయాలని కోరారు.

నేటి నుంచి ఉపాధి గ్రామసభలు

కొత్తవలస: మండలంలోని 25 పంచాయతీల్లో గురువారం నుంచి ఉపాధి హామీ పథకానికి సంబంధించిన గ్రామసభలు మూడు రోజుల పాటు నిర్వహించడం జరుగుతోందని ఉపాధి హామీ పథకం మండల అధికారి జనార్దనరావు తెలిపారు. ఈ గ్రామసభలో పంచాయతీలు తమ గ్రామానికి చెందిన పనులు విషయమై చర్చించుకుని తీర్మానాలు చేయాలన్నారు. మండలానికి సుమారు 33 కోట్ల రూపాయలు మంజూరు అయినట్టు తెలిపారు. వీటిని గ్రామాల వారీగా కేటాయించడం జరిగిందన్నారు. జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరూ సమావేశానికి హాజరుకావాలని సూచించారు.

గురుదేవ సేవలతో ఎంతోమందికి ప్రయోజనం

కొత్తవలస: గురుదేవ చారిటబుల్ ట్రస్టు ద్వారా ఎంతో మంది దివ్యాంగులు అనేక విధాలుగా ప్రయోజనం పొందుతున్నారని విజయనగరం ఆర్డీవో దాట్ల కీర్తి అన్నారు. బుధవారం మండలంలోని మంగళపాలెం గ్రామంలో ఉన్న గురుదేవ చారిటబుల్ ట్రస్టును ఆమె సందర్శించారు. విశాఖపట్టణంలోని సీతమ్మధారలో ఉన్న క్షత్రియ సంక్షేమ సమితి వారి సహకారంతో 150 మంది దివ్యాంగులకు ఉపకరణాలను ఆమె చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ ట్రస్టు చేస్తున్న సేవల గురించి తెలుసుకున్నానని, ఈ ట్రస్టు సందర్శిచాలని భావించి వచ్చానన్నారు. ఒకే వ్యక్తి చేతుల మీదుగా సేవలను సంవత్సరాల తరబడి అందించడం అభినందనీయమన్నారు. ట్రస్టు ద్వారా కార్పొరేట్ స్థాయిలో ఆసుపత్రి ఏర్పాటు చేసి గ్రామీణ ప్రాంత ప్రజలకు వైద్యసేవలు అందించడం హర్షనీయమన్నారు. త్వరలో ఇక్కడ క్యాన్సర్ రోగుల కోసం క్యాన్సర్ ఆసుపత్రిని ఏర్పాటు చేస్తున్నట్టు జగదీష్ బాబు ఆమెకు తెలిపారు. మరి కొద్ది రోజులలో ప్రారంభించేందుకు అవసరమైన భవనాలను సిద్ధం చేస్తున్నామని తెలిపారు. ఇకపై క్యాన్సర్ రోగులు విశాఖపట్టణం వంటి ప్రాంతాలకు వెళ్లనక్కరలేదన్నారు. కార్యక్రమంలో దివ్యాంగులకు ఆమె కృత్రిమ అవయవాలతో పాటు కాలిపర్స్, వీల్ చైర్స్, మోటారైజ్డ్ ట్రై సైకిల్స్‌ను అందజేశారు. కార్యక్రమంలో క్షత్రియ సంక్షేమ సమితి ప్రతినిధులు పాల్గొన్నారు.



దివ్యాంగులతో విజయనగరం ఆర్డీవో దాట్ల కీర్తి

పవన్ దీక్ష ముగింపు సందర్భంగా నగర సంకీర్తన



నగరసంకీర్తనలో జనసేనే, టీడీపీ, బీజేపీ కూటమి నాయకులు

బొబ్బిలి, అక్టోబరు 2: జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సనాతన ధర్మపరిరక్షణ కోసం చేసిన 11 రోజుల దీక్ష విజయవంతంగా ముగిసిన సందర్భంగా బొబ్బిలి పట్టణంలో బుధవారం రాత్రి జనసేన రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి పాలూరు బాబు ఆధ్వర్యంలో నగర సంకీర్తన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక వేణుగోపాలస్వామి ఆలయ జంక్షన్ నుంచి వేంకటేశ్వరస్వామి విగ్రహాన్ని రథంపై పట్టణ ప్రధాన వీధుల్లో జయ జయనాదాలతో ఊరేగించారు. హైందవ ధర్మంపై సంపూర్ణమైన విశ్వాసం ఉన్న వారందరితో కలిసి జనసైనికులు, టీడీపీ, బీజేపీ నాయకులంతా కలిసి నగర సంకీర్తన చేశారు. కంచరవీధి వేంకటేశ్వరస్వామి ఆలయం వరకు ఈ ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర నేత రౌతు రామ్మూర్తి, సుంకరి సాయిరమేష్, జనసైనికులు, వీరమహిళలు పాల్గొన్నారు.

చిరుధాన్యాల సాగుపై దృష్టి సారించాలి

● ప్రకృతి వ్యవసాయ రాష్ట్ర రిసోర్స్‌పర్సన్ దేవుళ్లు



చిరుధాన్యాల సాగును పరిశీలిస్తున్న వ్యవసాయ సిబ్బంది

గరుగుబిల్లి: రైతులు చిరుధాన్యాల సాగుపై దృష్టి సారించాలని ప్రకృతి వ్యవసాయ రాష్ట్ర రిసోర్స్‌పర్సన్ పి.దేవుళ్లు సూచించారు. బుధవారం మండలంలోని నందివానివలసలో సాగు చేస్తున్న చిరుధాన్యాల పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదాయంతో పాటు పోషకాలు లభించే రాగులు, కొర్రలు, సామలు, గంటెలు, జొన్న, అరికలు, జ్యులతో పాటు పలు రకాలపై శ్రద్ధ చూపాలన్నారు. చిరుధాన్యాలకు ప్రభుత్వం ప్రత్యేక గుర్తింపునిస్తోందని తెలిపారు. కార్యక్రమంలో ఎన్ఎఫ్ఏ జి.అన్నపూర్ణ, రమేష్, రైతులు శ్రీధర్, శ్రీకాంత్, హరికృష్ణ, సరోజ, లావణ్య పాల్గొన్నారు.

నేత్ర పరీక్షలు చేయించుకోవాలి

సంతకవిటి: సంతకవిటి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి డాక్టర్ నాగేంద్ర ప్రసాద్ పర్యవేక్షణలో బుధవారం నేత్ర శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆప్తాలిక్ ఆఫీసర్ ఎస్.వసంతరావు మాట్లాడుతూ 40 సంవత్సరాలు పైబడిన ప్రతి ఒక్కరూ కనీసం రెండు సంవత్సరాలకు ఒకసారైనా సమగ్ర నేత్ర పరీక్షలు చేసుకోవాలని అన్నారు. ఈ శిబిరంలో 42 మందికి కంటి పరీక్షలు చేయగా 20 మందికి కంటి శస్త్ర చికిత్సలు అవసరమని గుర్తించి, విజయనగరం పుష్పగిరి కంటి ఆసుపత్రికి పంపించామన్నారు.



కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

పరివర్తనతో మెలగాలి

● ఖైదీలకు సీనియర్ న్యాయాధికారి హితువు



ఖైదీలను ఉద్దేశించి మాట్లాడుతున్న సీనియర్ న్యాయాధికారి అరుణశ్రీ

బొబ్బిలి: జాతిపిత మహాత్మాగాంధీ దేశానికి అహింసా పద్ధతిలో స్వాతంత్ర్యం సాధించేందుకు కృషిచేశారని, ఆయన చూపిన మార్గంలో పయనించి పరివర్తనతో మెలగాలని బొబ్బిలి కోర్టు సీనియర్ సివిల్ జడ్జి ఎస్.అరుణశ్రీ హితవు పలికారు. గాంధీ జయంతి సందర్భంగా స్థానిక సబ్‌జైలులో బుధవారం ఖైదీల సంక్షేమ దినోత్సవాన్ని జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆమె ఖైదీలను ఉద్దేశించి మాట్లాడారు. క్షణికావేశంలో నేరాలకు పాల్పడిన వారు తమ తప్పిదాలను గుర్తెరిగి పశ్చాత్తాపం పొందాలన్నారు. సర్వమానవ సౌ భ్రాతృత్వంతో, సోదర భావంతో మెలగాలన్నారు. చట్టపరంగా ఖైదీల సంక్షేమానికి తాము కృషి చేస్తామన్నారు. ఇదే రోజు భారత మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి జయంతి కూడా కావడంతో ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఒకటవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఎం.రోహిణీరావు, సబ్‌జైలు సూపరింటెండెంట్ పాత్రో, బార్‌అసోసియేషన్ అధ్యక్షుడు పి.మోహన మురళీకుమార్, న్యాయవాదులు సీహెచ్‌ఎల్‌వీ ప్రసన్నకుమార్, సామాజిక కార్యకర్త గేదెల చంద్రినాయుడు తదితరులు పాల్గొన్నారు.

లేబర్ బడ్జెట్ ఆమోదం

రేగిడి: మండలంలో అంబఖండి గ్రామంలో మంగళవారం గాంధీ జయంతి పురస్కరించుకొని నిర్వహించిన గ్రామసభలో రూ.2.70కోట్ల ఉపాధి పనులకు సంబంధించి లేబర్‌బడ్జెట్‌ను ఆమోదించారు. సర్పంచ్ శాసపు లక్ష్మీగోవిందనాయుడు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో 717 జాబ్ కార్డులకు గాను పనిదినాలు కల్పించాలనే లక్ష్యంతో గ్రామసభలో లేబర్ బడ్జెట్‌ను రూపొందించి ఆమోదించినట్లు ఉపాధి ఏపీవో హరనాథ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ ప్రతినిధి గోపాలకృష్ణ, పంచాయతీ కార్యదర్శి హేమసుందరరావు, టీఏ రాంబాబు, ఎఫ్ఏ శ్రీధర్ వేతనదారులు పాల్గొన్నారు.



లేబర్ బడ్జెట్‌పై గ్రామసభ దృశ్యం

ఉపాధి పనులపై గ్రామ సభలు

బాడంగి: ఉపాధి హామీ పనులపై గ్రామసభలు నిర్వహిస్తున్న స్థానిక సర్పంచ్ కండి రమేష్ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఈ పనులపై అధికారులు, ప్రజాప్రతినిధు లతో సమావేశం నిర్వహించారు. పనుల గుర్తింపునకు ఈ సభలు నిర్వహిస్తున్నట్టు ఆయన తెలిపారు. 25 పంచాయతీల్లో ఉపాధి పనుల గుర్తింపునకు సభలు నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో, ఎంపీటీసీ సభ్యులు దేవరాపల్లి శ్రీనివాసరావు, జడ్పీటీసీ రామారావు, ఈవోపీఆర్‌డీ సూర్యనారాయణ, పంచాయతీ సెక్రటరీ సూర్యారావు తదితరులు పాల్గొన్నారు.



బాడంగిలో మాట్లాడుతున్న సర్పంచ్

నచ్చినచోట తవ్వేస్తున్నారు..

శృంగవరపుకోట రూరల్: మండలంలోని కొందరు వ్యక్తులు ప్రభుత్వ స్థలాలను పట్టపగలు తమకు నచ్చినరీతీలో కబ్జాలు చేస్తున్నారు. వీరిని ప్రశ్నించే ఏ అధికారి వీరిని అడ్డుకోకపోవడంతో వీరు మరింత బలంగా భావించి నచ్చినట్లు ప్రవర్తిస్తున్నారు. మండలంలోని సంతగైరమ్మపేట-జామి రహదారిలో ఉన్న పంట కాలువలు, ప్రభుత్వ స్థలాలు తవ్వేస్తున్నారు. ఈ పొలాలకు నీరు వెళ్లే మార్గం మూసేస్తున్నారు. మరికొందరు ఈ కాలువలు తవ్వేసి అందులో తమకు నచ్చిన రీతీలో పైపులు వేసి స్థలం చదునుచేసి నిర్మాణాలు పట్టపగలుచేస్తున్నారు. వీటిని అడ్డుకోవాల్సిన అధికారులు మనకేందుకు లే అన్నరీతీలో ఉండటంతో వీరు ఇష్టానుసారం చెలరేగుతున్నారు. వీటిని అధికారులు నిరోధించాలని పంటకాలువలను ఆనుకుని ఉన్న రైతులు కోరుతున్నారు.



ఎస్.కోట-జామి మార్గంలో పంటకాలువలు తవ్వేస్తున్న దృశ్యం

రాష్ట్రస్థాయి క్రీడాపోటీలకు విద్యార్థులు

రేగిడి: మండలంలో సంకిలి, కందిశ హైస్కూల్ విద్యార్థులు రాష్ట్రస్థాయి క్రీడాపోటీలకు ఎంపికైయ్యారు. ఈనెల 1న శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాలలో జిల్లాస్థాయిలో జరిగిన అండర్-14, 17 విభాగాలైన బాల్‌బ్యాడ్మింటన్, వాలీబాల్, కబాడీ పోటీల్లో తమ సత్తాచాటి రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించినట్లు సంకిలి, కందిశ హెచ్ఎంలు ఎం రామినాయుడు, వి నారాయణరావులు మంగళవారం స్థానిక విలేఖర్లుకు తెలిపారు. వీరి ఎంపికపై అయాపాఠశాలల్లో ప్రత్యేక అభినందన కార్యక్రమాలు నిర్వహించారు. అండర్ 14లో బాల్ బ్యాడ్మింటన్‌లో బాలురు నుంచి సంకిలి హైస్కూల్‌కు చెందిన మజ్జి హరీష్, ఖండాపు తేజేశ్వరరావులు ఎంపికకాగా, అండర్ 17 నుంచి ఇదేపాఠశాల విద్యార్థి మజ్జి తివిక్రిమరావు ఎంపికకగా, వాలీబాల్ నుంచి కందిశ హైస్కూల్ విద్యార్థినులు ఇప్పిలి రేష్మ, కర్రి లహరిలు ఎంపికకాగా, స్టాండ్‌బైకు గాను మీసాల గౌతమి ఎంపికైంది. ఇంకా కబాడీకి గాను ఇదే పాఠశాల విద్యార్థిని సోడిశెట్టి లోకేశ్వరీ ఎంపికైనట్లు పాఠశాల వర్గాలు తెలిపాయి. వీరి ఎంపికపై పాఠశాల ఉపాధ్యాయులతో పాటు ఎంఇఓ వరప్రసాదరావులు అభినందించారు.

ఆదర్శ పాఠశాల విద్యార్థుల ప్రతిభ

సాలూరు రూరల్: మండలంలోని పురోహితునివలస ఆదర్శపాఠశాలకు చెందిన 11 మంది విద్యార్థులు రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికైనట్టు ప్రిన్సిపాల్ ఎస్. అంజలీదేవి చెప్పారు. బాలుర విభాగంలో షణ్ముఖ మణికంఠ, బాలికల విభాగంలో జ్ఞానప్రసన్న,అర్చన, ఆస్మిత,స్విమ్మింగ్‌కు శివాజీ తదితరులు ఎంపికకావడంతో పీడీ రవి, ఉపాధ్యాయులు అభినందించారు.

పారిశుధ్య కార్మికులకు పురస్కారాలు

రాజాం: స్వచ్ఛతా హీ సేవ 2024లో భాగంగా సెప్టెంబరు 17 నుంచి అక్టోబరు 1 వతేదీ వరకు వివిధ పారిశుధ్య కార్యక్రమాలను నిర్వహించారు. సదరు కార్యక్రమంలో విశిష్ట సేవలు అందించిన పారిశుధ్య కార్మికులకు, స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులకు గాంధీ జయంతి సందర్భంగా వారికి పురస్కారాలను అందించారు. అనంతరం మున్సిపాల్ కార్యాలయంలో గాంధీ జయంతి కార్యక్రమం నిర్వహించారు. గాంధీజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతను తప్పనిసరి అన్నారు. అనంతరం పారిశుధ్య కార్మికులకు శాలువలతో సత్కరించారు. తదుపరి స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులను శాలువలతో సత్కరించారు. కొత్తా సాయిప్రశాంత్‌కుమార్. బి వి అచ్యుత్‌కుమార్. యు నిలకంఠేశ్వరయాదవ్ సెనటరీ ఇన్స్‌పెక్టర్ చేగొండి ప్రసాద్. తదితరులు పాల్గొన్నారు.



రాజాంలో..



జామిలో..

జామి: మండలంలోని భీమసింగి పంచాయతీలో గాంధీ జయంతి వేడుకలు పురస్కరించుకొని టీడీపీ మండలపార్టీ ఆధ్యక్షుడు స్వామినాయుడు ఆధ్వర్యంలో గ్రామంలో పారిశుధ్యకార్మికులను సత్కరించారు.

నేటి నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు

పార్వతీపురంటౌన్: పార్వతీపురంలో గురువారం నుంచి ఈనెల 12వ తేదీ వరకు దుర్గాదేవి అమ్మవారి శరన్నవరాత్రి ఉత్సవాల నిర్వహణకు ఆలయ, ఉత్సవ కమిటీసభ్యులు సిద్ధంచేస్తున్నారు. అయ్యప్పస్వామి ఆలయప్రాంగణంలో గల కోట దుర్గ, కొత్తవలస నవదుర్గా ఆలయాలతోపాటు రెడ్డివీధి, బెలగాం, బైపాస్‌కాలనీ వీధుల్లో దుర్గాదేవి పూజలకు ఉత్సవ మండపాలను అయా కమిటీలు ఏర్పాటు చేస్తున్నాయి. ఆలయాలతోపాటు ఉత్సవమండపాల్లో ప్రత్యేక, సామూహిక కుంకుమార్చనలు, హోమాలు, తదితర పూజా కార్యక్రమాల్లో పాల్గొనాలని, ఆలయాల నిర్వాహకులతోపాటు ఉత్సవ కమిటీల సభ్యులు ప్రచారం చేస్తున్నారు.

● **వీరఘట్టం:** స్థానిక కోటదుర్గమ్మ ఆలయంలో గురువారం నుంచి 12వ తేదీ వరకు శరన్నవరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేశారు. యజ్ఞకర్త ఎస్వీఎల్ఎన్.శర్మయాజీ ఆధ్వర్యంలో ఉత్సవాలు నిర్వహించనున్నారు.

●**సాలూరురూరల్:** సాలూరులో శరన్నవరాత్రోత్సవాలు గురువారం ప్రారంభం కానున్నాయి. టాక్సీ స్టాండ్ వద్ద ఉత్సవాలు నిర్వహణకు ఏర్పాట్లు చేశారు.

రాజకీయాలకు అతీతంగా ఉత్సవాలు జరగాలి

పాలకొండ: రాజకీయాలకు అతీతంగా కోటదుర్గమ్మ అమ్మవారి శరన్నవరాత్రి ఉత్సవాలు జరగాలని మాజీ సర్పంచ్, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యుడు పల్లా కొండలరావు కోరారు. బుధవారం పాలకొండలోని ఆలయ ప్రాంగణంలో సమావేశం నిర్వహించారు.ఈసందర్భంగా మాట్లాడుతూ ఆలయ పరిసరాల్లో ఫ్లెక్సీ బ్యానర్లను నిషేధించినట్లు తెలిపారు.

పోలీసులకు ప్రజలు సహకరించాలి

దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో పోలీసులకు ప్రజలు, భక్తులు సహకరించాలని సీఐ చంద్రమౌళి ఒక ప్రకటనలో కోరారు. పదిరోజులు లోపలకు ఎలాంటి భారీ వాహనాలకు అనుమతిలేదని తెలిపారు. శ్రీకాకుళం నుంచి వచ్చిన భక్తులకు ఆర్‌సీఎం చర్చి వద్ద పార్కింగ్ ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. వీరఘట్టం నుంచి వచ్చే వాహనాలు రాజాం వైపు మళ్లించినట్లు పేర్కొన్నారు.

వర్షాలకోసం కొండదేవతకు పూజలు


కొండదేవతకు పూజలు చేస్తున్న మహిళలు

భామిని: మండలంలోని వడ్డంగిలో వర్షాలు కురవాలని ఆ గ్రామ కొండ దేవతకు బుధవారం పూజలు నిర్వహించారు. గ్రామంలో ప్రతి ఇంటి నుంచి కలశాలు, ముర్రాటలు, మేళతాళాలతో కొండపైకి వెళ్లి కొండదేవతకు ప్రత్యేక పూజలు చేశారు. అలాగే కప్పలకు పూజలు నిర్వహించారు.

గాంధీ సత్రంలో అన్న సమారాధన

పార్వతీపురం టౌన్: పార్వతీపురం గాంధీసత్రంలో 75 ఏళ్లుగా గాంధీ జయంతిని పురస్కరించుకొని అన్న సమారాధన నిర్వహిస్తున్నారు. ఈ మేరకు బుధవారం గాంధీజయంతిని పురస్కరించుకొని గాంధీసత్రంలో ఏర్పాటుచేసిన అన్నసమారాధనలో ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర పాల్గొన్నారు.పేదలకు చీరలు, దుప్పట్లను పంపిణీ చేశారు. అనంతరం సామాజిక సేవకుడు, పట్టణ పోలీసు హెచ్‌సీ కృష్ణమూర్తిని, ఎమ్మెల్యే, దేవదాయశాఖ ఈవో ప్రసాదులు సన్మానించారు.

కృష్ణమోహన్‌కు పరామర్శ


కృష్ణమోహన్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుంటున్న మానివేంద్రనాథ్ రాయ్

పార్వతీపురంటౌన్: పట్టణానికి చెందిన టీడీపీ నాయకుడు మజ్జి కృష్ణమోహన్ ఇటీవల గుండె శస్త్రచికిత్స చేయించుకోవడంతో గుజరాత్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చీకటి మానివేంద్రనాథ్ రాయ్ బుధవారం పరామర్శించారు. ఎస్ఎన్ఎంనగర్‌లోని కృష్ణమోహన్ నివాసానికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైద్యులు చీకటి బదరీ నారాయణ, టీడీపీ నాయకులు మజ్జి రాజా పాల్గొన్నారు.

హిందూ ధర్మాన్ని పరిరక్షించాలి: ఎమ్మెల్యే


జనసేన నాయకులతో కలిసి ర్యాలీ చేస్తున్న ఎమ్మెల్యే విజయచంద్ర

పార్వతీపురంటౌన్:హిందూ ధర్మాన్ని పరిరక్షించాలని ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర పిలుపునిచ్చారు.బుధవారం తిరుపతి వేంకటేశ్వరస్వామి ఆలయంలో గత ప్రభుత్వహయాంలో జరిగిన తప్పులు మన్నించాలని ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌చేపట్టిన ప్రాయశ్చితదీక్షకు మద్దతుగా జనసేననాయకులు పార్వతీపురంలోని ప్రధాన రహదారి నుంచి పాతబస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు.

●**గరుగుబిల్లి:** హిందువుల మనోభావాలను దెబ్బతీసే వారికి తగిన శాస్తి తప్పదని పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర తెలిపారు. తోటపల్లి వేంకటేశ్వరస్వామి దేవస్థానం ఆవరణలో తిరుమల తిరుపతి దేవస్థానంలో గత ప్రభుత్వంలో జరిగిన తప్పులను మన్నించాలని పూజలు నిర్వహించారు. ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చేపట్టిన ప్రాయశ్చిత దీక్షకు సంఘీభావంగా హోమాలు చేశారు. కార్యక్రమంలో అరకు నియోజకవర్గ టీడీపీ అధికార ప్రతినిధి డొంకాడ రామకృష్ణ, జనసేన ప్రతినిధి పాలూరు బాబుతో పాటు కురుపాం, పాలకొండ, పార్వతీపురం నియోజకవర్గాల పరిధిలోని కూటమి ప్రతినిధులు పాల్గొన్నారు.

ఈ-కేవైసీ నమోదు చేసుకోవాలి: ఏవో

పాచిపెంట: రైతులు రెండు, మూడు రోజుల్లో ఈకేవైసీ తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని ఏవో కె.తిరుపతిరావు తెలిపారు. బుధవారం మండలంలోని మాతుమూరు, గురువునాయుడుపేట, తాడూరుల్లో ఈకేవైసీ పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ-కేవైసీలో తప్పులు దొర్లినట్లు తెలియజేస్తే సరిచేస్తామని చెప్పారు.ఖరీఫ్ సీజన్‌లో మండలంలో ఈ-పంట నమోదు 96శాతం పూర్తయిందని, మిగిలిన వారు కూడా నమోదు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు దినేష్‌కుమార్, గణేష్ పాల్గొన్నారు.

మద్యం దుకాణాలకు దరఖాస్తుల స్వీకరణ

సీతానగరం: మద్యం షాపుల నిర్వహణకు సీతానగరం ఎక్సైజ్ స్టేషన్‌లో ఏర్పాటుచేసిన దరఖాస్తుల కార్యక్రమాన్ని బుధవారం ఏఈఎస్ బి.జీవన్‌కిషోర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీతానగరం, బలిజిపేట, గరుగుబిల్లి మండలాలకు సంబంధించి 12 మద్యం షాపులకు ఈనెల తొమ్మిదో తేదీ వరకూ దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీఐ పద్మావతి, సిబ్బంది పాల్గొన్నారు.

గాంధీకి ఘన నివాళి

రాయగడ: స్థానిక గాంధీపార్క్‌లో బుధవారం జిల్లా యంత్రాంగం గాంధీజీ, ప్రధాని లాల్‌బహదూర్ శాస్త్రిల జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీ, లాల్‌బహదూర్ శాస్త్రి, బీఆర్ అంబేద్కర్, ఉత్కళమణి గోప బంధుదాస్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కలెక్టర్ పారుల్ పట్వార్, అదనపు కలెక్టర్ భాస్కరచంద్ర రౌయిత్, డీఐపీఆర్వో బసంత కుమార్ ప్రధాన్ పాల్గొన్నారు.

రాయగడ జిల్లా కేంద్రాసుపత్రిలో స్వచ్ఛభారత్


చెత్త ఊడ్చుతున్న క్లబ్ సభ్యులు

రాయగడ: స్థానిక కేంద్ర ఆసుపత్రి ప్రాంగణంలో బుధవారం మహిళా, యూత్ వాకర్స్ క్లబ్ సభ్యులు స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సీడీఎంవో లాల్ మోహన్‌రౌత్రాయ్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు

రాయగడ: కళ్యాణ సింగుపూర్ సమితిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు గాయపడ్డారు. ఎస్ఐ శివప్రసాద్ కథనం మేరకు.. కళ్యాణ సింగుపూర్ సమితి సింగారి పంచాయతీ కరంజి గ్రామానికి చెందిన గోకుల్‌మాలి, బైసాక్‌లు కళ్యాణసింగుపూర్‌లో పనులు ముగించుకుని ద్విచక్రవాహనంపై వెళ్తున్నారు. సన్నోబామనగుడ గ్రామానికి చెందిన లచ్చన్న హిక్కాక, రాందాస్‌సారకలు ద్విచక్రవాహనంపై ఎదురుగా వస్తున్నారు. రెండు వాహనాలు ఎదురెదురుగా ఢీకొనడంతో నలుగురు గాయపడ్డారు. విషయం తెలుసుకున్న ఎస్.ఐ.శివప్రసాద్ సిబ్బందితో వెళ్లి క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం రాయగడ జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


గుమ్మలక్ష్మీపురం: గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి


పాలకొండ: సబ్‌జైలులో గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న సిబ్బంది


వీరఘట్టం: ఎంపీడీవో కార్యాలయంలో ...


పార్వతీపురంలో సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ..

గాంధీ ఆశయ సాధనకు కృషి

● జయంతి పురస్కరించుకుని చిత్రపటాలు, విగ్రహాలకు ఘన నివాళి


గరుగుబిల్లి: గొట్టివలసలో గాంధీ విగ్రహానికి పూలమాల వేస్తున్న గ్రామస్థులు

స్వాతంత్ర్య సమరయోధుడు మహాత్మాగాంధీ ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని వక్తలు పిలుపునిచ్చారు. బుధవారం గాంధీ జయంతి పురస్కరించుకుని జిల్లాలో ఆయన చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన చేసిన సేవలను గుర్తుచేసుకున్నారు. (ఆంధ్రజ్యోతి బృందం)


సీతంపేట రూరల్: ఐటీడీఏ కార్యాలయ ప్రాంగణంలో గాంధీ విగ్రహానికి పూలమాలలను వేసి నివాళులర్పిస్తున్న అధికారులు


బెలగాం: ఎస్పీ కార్యాలయంలో గాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎస్పీ మాధవరెడ్డి, సిబ్బంది


మక్కువ: గాంధీ చిత్రపటానికి నివాళి


పాచిపెంట: గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఆటో యూనియన్ నాయకులు


సీతానగరం: గాంధీ చిత్రపటం వద్ద...


బలిజిపేట: గాంధీ విగ్రహానికి పూలమాల వేస్తూ..

పరిశుభ్రత సామాజిక బాధ్యత: కలెక్టర్


ప్రతిజ్ఞచేస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్, ఎమ్మెల్యే విజయచంద్ర

పార్వతీపురంటౌన్:పరిశుభ్రత సామాజికబాధ్యత అని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. బుధవారం పార్వతీపురంలోని ఎస్ఎన్ఎంనగర్ పార్క్‌లో స్వచ్ఛత దివాస్ కార్యక్రమం నిర్వహించారు.తొలుత గాంధీ చిత్రపటానికి, ఎమ్మెల్యే బోనెల విజయచంద్రతోపాటు పూలమాలవేసి నివాళులర్పించారు.ఈసందర్భంగా స్వచ్ఛభారత్‌లో అందరం భాగస్వాములవుతాని, కలెక్టర్‌తో ఎమ్మెల్యే, సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, మున్సిపల్ కమిషనర్ కె. శ్రీనివాసరావు, తదితరులు ప్రమాణం చేశారు. అనంతరం స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమం ముగింపులో భాగంగా ఎస్ఎన్ఎంనగర్ నుంచి పాత బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. అలాగే పరిసరాలు శుభ్రంగా ఉంటేనే ఆలోచనలు బాగుంటాయని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ తెలిపారు.బుధవారం పార్వతీపురం శివారులోగల జట్టు ఆశ్రమంలో స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమం నిర్వహించారు. స్వచ్ఛసుందర పార్వతీపురమే లక్ష్యంగా పనిచేస్తున్న జట్టు ఆశ్రమ నిర్వాహికులు పద్మజకు అభినందించారు. అనంతరం జట్టు ఆశ్రమ విద్యార్థినుల శాస్త్రీయ నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో నాబార్డు డీడీఎం దిలీప్ పాల్గొన్నారు.

●**పార్వతీపురం ఆంధ్రజ్యోతి:** ప్రజారోగ్యం కాపాడడంలో పారిశుధ్య కార్మికులు అందిస్తున్న సేవలు అమోఘమని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ తెలిపారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛభారత్ దివస్ నిర్వహించారు. కార్యక్రమంలో సబ్‌కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, డీపీవో కె.రామచంద్రరావు, డీఆర్వో జి.కేశనాయుడు, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీరింగ్ అధికారి ఓ.ప్రభాకరరావు పాల్గొన్నారు.

రోడ్డు సౌకర్యం కల్పించాలి

గుమ్మలక్ష్మీపురం: రోడ్డు సౌకర్యం కల్పించాలని బయ్యాడ గ్రామస్థులు కోరారు. ఈ మేరకు కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి బుధవారం వినతిపత్రం అందజేశారు. రోడ్డు లేకపోవడంతో అత్యవసర సమయాల్లో వైద్యసేవలు అందడం లేదని, రాకపోకలకు ఇబ్బందిగా మారిందని తెలిపారు. బయ్యాడకు రహదారి నిర్మాణానికి ప్రతిపాదనలు పంపిస్తానని, రోడ్డు నిర్మాణానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే తెలిపారు.

ఎమ్మెల్యే జగదీశ్వరికి ప్రశంసాపత్రం

గుమ్మలక్ష్మీపురం:మనటీడీపీ యాప్ ద్వారా పార్టీ కంటెంట్‌ను ప్రజల్లోకి తీసుకెళ్లి టాప్‌స్కోర్‌లో నిలిచిన కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేష్ ప్రశంసాపత్రం పంపించారు. ఈ మేరకు ఎమ్మెల్యేకు క్యాంప్‌కార్యాలయంలో నాయకులు సన్మానించారు. పార్టీకోసం పనిచేసిన కార్యకర్తలకు మన టీడీపీ యాప్ గౌరవాన్ని ఇచ్చిందని ఎమ్మెల్యే తెలిపారు.

పశువుల అక్రమ రవాణాపై కేసు నమోదు

కొమరాడ : ఒడిశా నుంచి ఆరు వాహనాల్లో అక్రమంగా 38 పశువులను రవాణా చేస్తుండగా బుధవారం అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ నీలకంఠం తెలిపారు. పార్వతీపురం, అడ్డాపుశీల వైపు రవాణా చేస్తుండగా పట్టుకుని కేసు నమోదు చేసినట్లు చెప్పారు. వాహన చోదకులను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు.

710 మందికి వైద్యసేవలు

సాలూరు రూరల్: సాలూరు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం లయన్స్‌క్లబ్ ఇంగ్లీషు మీడియం ఉన్నత పాఠశాలలో వైద్యశిబిరం నిర్వహించారు.ఈ సందర్భంగా సాలూరు,పరిసర గ్రామాల నుంచి 710 మందికి వైద్య సేవలందించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు వాడాడ గణేశ్వరరావు, ఆరిశెట్టి మోహనరావు, సంజీవనాయుడు, పెంట శ్రీనివాసరావు,చక్రపాణి పాల్గొన్నారు.

● **జియ్యమ్మవలస :** మండలంలో పెదమేరంగి కూడలిలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ సౌజన్యంతో సహాయ స్ఫూర్తి ఫౌండేషన్, తిరుమలసాయి హైస్కూల్ ఆధ్వర్యంలో విశాఖపట్నం శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి సహకారంతో నేత్ర వైద్య శిబిరం జరిగింది. ఈ సందర్భంగా శంకర్ ఫౌండేషన్ ఆప్తమాలజిస్టు డాక్టర్ అలేఖ్య 143 మంది కంటి రోగులను పరీక్షలు చేశారు. ఇందులో 21 మంది కేటరాక్ట్ సర్జరీ చేయాలని నిర్ధారించి ఎంపిక చేశారు.కార్యక్రమంలో ఆర్.వెంకటరమణ, వెంకటరమణ, సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల సేవలు మరువలేం

గరుగుబిల్లి: ప్రజలు రోగాలబారిన పడకుండా ప్రాణాలను సైతం లెక్క చేయకుండా విధులు నిర్వహిస్తున్న పారిశుధ్య కార్మికుల సేవలు మరువరానివని జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ మరిశర్ల బాపూజీనాయుడు తెలిపారు. బుధవారం రావివలసలో గాంధీ జయంతిని పురస్కరించుకుని పారిశుధ్య కార్మికులకు సన్మానించారు. కార్యక్రమంలో ఏవో ఎన్.అర్జునరాజు, ఉపాధి ఏపీవో ఎం.గౌరీనాథ్, కార్యదర్శి ఆర్.శశిభూషణరావు, సర్పంచ్ బి.అప్పడు, వీఆర్వో ఆర్.వినాయక్ పాల్గొన్నారు.

సమాజహిత కార్యక్రమాలను చేపట్టాలి

● వైద్యుడు ద్వారపురెడ్డి రామ్మోహనరావు


రక్తదాతకు ప్రశంసాపత్రాన్ని అందజేస్తున్న రామ్మోహనరావు

పార్వతీపురం టౌన్: ప్రతి మనిషి జీవితంలో సమాజహిత, మంచి కార్యక్రమాలను చేపట్టాలని పట్టణానికి చెందిన ప్రముఖ వైద్యుడు, కర్షక మహర్షి ఆసుపత్రుల అధినేత డాక్టర్ ద్వారపురెడ్డి రామ్మోహనరావు తెలిపారు. బుధవారం ద్వారపురెడ్డి రామ్మోహనరావు జన్మదిన వేడుకలు కుటుంబ సభ్యులు, స్నేహితుల మధ్య జరిగాయి. ఈసందర్భంగా కర్షక మహర్షి ఆసుపత్రుల మేనేజింగ్ డైరెక్టర్ ద్వారపురెడ్డి పృథ్వీమోహన్ ఆధ్వర్యంలో రామ్మోహనరావు కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలను జరుపుకొన్నారు. అనంతరం రక్తదాన శిబిరాన్ని నిర్వహించి దాతలకు ప్రశంసాపత్రాలు అందజేయడంతోపాటు వారికి అభినందించారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యమే మహాభాగ్యం అన్న సూక్తిని ప్రతిఒక్కరూ పాటించాలన్నారు. కార్యక్రమంలో కర్షకమహర్షి ఆసుపత్రి ప్రసూతి వైద్యనిపుణులు డాక్టర్ డి. ప్రతిమాదేవి పాల్గొన్నారు.

చేయి చేయి కలిపి.. శ్రమదానంచేసి


సీతంపేట రూరల్: పైప్‌లైన్ పూడ్చడానికి గొయ్యిని తవ్వుతున్న గిరిజన మహిళలు

సీతంపేట రూరల్: చంద్రమ్మగూడ గ్రామానికి చెందిన గిరిజనులు చేయి చేయి కలిపి శ్రమదానంచేసి రక్షిత మంచినీటి పైపులైన్ దెబ్బతినకుండా చర్యలు తీసుకున్నారు. చంద్రమ్మగుడి సమీపంలో ఉన్న చంద్రమ్మగూడ గ్రామానికి కాగుమానుగూడ నుంచి గ్రావిటేషన్‌ఫ్లో పైప్‌లైన్ ద్వారా తాగునీరు వస్తోంది. పైపులైన్ గుడి పక్క నుంచిరావడంతో ఇక్కడకు వచ్చే వాహనాలు నిత్యం పైపు లైన్‌పై నుంచి వెళ్లడంతో నీటి సరఫరాకు అంతరాయం కలుగుతోంది. దీంతో బుధవారం ఆ గ్రామానికి చెందిన సవర ఆనప,సవర రాధ, గంగమ్మ, లలిత,భారతిలు పైప్‌లైన్ వెళ్లే మార్గంలో శ్రమదానం చేసి గొయ్యి తవ్వి మట్టితో కప్పారు.

వెంకట బైరిపురంలో యువకుల శ్రమదానం

మక్కువ: వెంకట బైరిపురం గ్రామ సమీపంలో మక్కువ, చినభోగిలి రహదారిలో యువకులు శ్రమదానం నిర్వహించి గోతులు పూడ్చారు. రోడ్డుపై గోతులు ఏర్పడడంతో వాహనచోదకులు, ప్రయాణికులు ఇబ్బందిపడు తున్నారు. దీంతో యువకులు బుధవారం గోతులు పూడ్చారు.

గిరిజనుల రైతులకు పరిహారం ఇవ్వాలి

మక్కువ: నకిలీ మొక్కజొన్న విత్తనాలతో నష్టపోయిన గిరిజనుల రైతులకు పరిహారం ఇవ్వాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు డిమాండ్ చేశారు. బుధవారం నంద గ్రామంలో మొక్కజొన్న పంట పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నంద గ్రామంలో నకిలీ మొక్కజొన్న విత్తనాలతో గిరిజన రైతులను మోసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. 15 మంది గిరిజన రైతులు మక్కువలోని ప్రైవేటు వ్యాపారుల వద్ద మొక్కజొన్న విత్తనాలను కొనుగోలు చేశారని, వాటి వల్ల మొక్కజొన్న పంట నష్టం వాటిల్లిందని తెలిపారు. కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం మండల కార్యదర్శి తాడంగి ప్రభాకర్, రైతులు పాల్గొన్నారు.

వరద బాధితులకు సాయం

గుమ్మలక్ష్మీపురం: విజయవాడ వరద బాధితులకు సాయంగా గుమ్మలక్ష్మీపురానికి చెందిన సరస్వతి విద్యానికేతన్ కరస్పాండెంట్ విమల రూ.10వేలు ఆర్థిక సాయం చేశారు. ఈ మొత్తాన్ని కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరికి బుధవారం అందించారు.

చినమరికి వద్ద ఏనుగుల సంచారం

పార్వతీపురం రూరల్: మండలంలోని పెద్దమరికి పంచాయతీ చిన్నమరికి వద్ద ఏనుగుల గుంపు సంచరించడంతో గ్రామస్థులు ఉలిక్కిపడ్డారు. ఏనుగులు గ్రామ సమీపంలోకి రావడంతో భయందోళన చెందుతున్నారు. అటవీశాఖాధికారులు స్పందించి ఏనుగులును తరలించాలని కోరుతున్నారు.

పలగరలో గ్రంథాలయం ప్రారంభం

బలిజిపేట:మండలంలోని పలగరలో బుధవారం దివంగత చౌడు అప్పలనాయుడు మాస్టార్ జ్ఞాపకార్థం కుటుంబసభ్యులు వావులపల్లి అజయ్‌కుమార్ నేతృత్వంలోగ్రంథాలయం, రీడింగ్‌రూమ్ బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో న్యాయవాది ఎస్ఎస్వీఆర్ ం రాజు, ఈర్ల సంజీవనాయుడు, సర్పంచ్ వెమల జాను, భాస్కరరావు, గౌరి పాల్గొన్నారు.

రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు

సాలూరు రూరల్:రాష్ట్రంలో అంబేద్కర్ రాజ్యాంగం కాకుండా రెడ్‌బుక్ రాజ్యాంగం అమలవుతోందని మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర ఆరోపించారు. బుధవారం సాలూరులో గాంధీజయంతి సందర్భంగా గాంధీ విగ్రహాన్నికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పాచిపెంట చినబాబు,దండి శ్రీనివాసరావు, వంగపండు అప్పలనాయుడు, గిరి రఘు, సింగారపు ఈశ్వరరావు, జగన్మోహనరావు పాల్గొన్నారు.

సాలూరులో గణనాథుని నిమజ్జనం

సాలూరు రూరల్: సాలూరు డబ్బివీధి రామమందిరం వద్ద ఏర్పాటుచేసిన గణనాథుని బుధవారం నిమజ్జనం చేశారు. గోవా నుంచి రూ.లక్షల రూపాయల వ్యయంతో కొనుగోలు చేసి వివిధ దేవత బొమ్మలను తిరువీధిలో ఉంచారు. వాటితో పాటు బళ్లవేషాలు, వివిధ సంబరాలతో ఊరేగించారు.అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు భద్రత ఏర్పాట్లు చేశారు

పీసా చట్ట ప్రకారం ఎన్నికలు జరపాలి

సాలూరు రూరల్: గిరిజన పంచాయతీల్లో పీసీ చట్టప్రకారమే ఎన్నికలను నిర్వహించాలని తుండ పంచాయతీ సర్పంచ్ సీదరపు నూకయ్య డిమాండ్ చేశారు. బుధవారం తుండలో ఆయన ఆధ్వర్యంలో గ్రామసభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పార్వతీపురం ఐటీడీఏ పరిధిలో 216 పంచాయతీల్లో పీసా ప్రకారం ఎన్నికలు నిర్వహించాల్సి ఉండగా కేవలం 77 పంచాయతీల్లో మాత్రమే ఎన్నికలు నిర్వహించారన్నారు. కార్యక్రమంలో నిమ్మక అన్నారావు,అడ్డాకుల బాలదొర,సీదరపు భీముడు,చిన్నప్ప తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల గుర్తింపునకు గ్రామసభలు

వీరఘట్టం: మండలంలో 34 పంచాయతీలకు గాను కె.ఇచ్చాపురం, కత్తులకవిటి, ఎంవెంకటాపురం మినహా మిగిలిన 31 పంచాయతీలో బుధవారం 2025-26 ఆర్థికసంవత్సరంలో ఉపాధిపథకం పనుల గుర్తింపునకు గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా హుస్సేన్‌పురం గ్రామసభలో ఏపీవో సత్యంనాయుడు మాట్లాడుతూ ప్రజల అభిప్రాయాల మేరకు పనులను నిర్ణయిస్తామన్నారు. కార్య క్రమంలో ఎంపీడీవో వెంకటరమణ, గ్రామపెద్దలు, అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

●**గరుగుబిల్లి:** గ్రామసభ ఆమోదంతోనే ఉపాధి పనులు గుర్తించనున్నట్లు ఎంపీడీవోజి.పైడితల్లి, ఏపీవో ఎం.గౌరీనాథ్ తెలిపారు. 25 పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ బి.చంద్రినాయుడు, మాజీ సర్పంచ్ పి.పూర్ణచంద్రరావు, కార్యదర్శి టి.భాస్కరరావు, క్షేత్ర సహాయకులు నల్ల సూర్యనారాయణ పాల్గొన్నారు.

● **భామిని:** ప్రజల ఐక్యతతో గ్రామాభివృద్ధి జరుగుతుదని డీఎల్‌డీవో వీవీ గోపాలకృష్ణ పేర్కొన్నారు. బుధవారం భామిని, బాలేరు, ఘనసరలో ఉపాధి హామీ పథకం గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆకాంక్షిత మండలంగా భామినిని కేంద్ర ప్రభుత్వం గుర్తించిందన్నరు. ఈ సందర్భంగా స్వచ్ఛత డ్రగ్ నివారణ, ఫిటట్ఇండియా ప్రతిజ్ఞలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో చంద్రరావు, ఈవోపీఆర్‌డీ కె.కృష్ణారావు, ఏపీవో ఈగల తులసి, ఏపీఎం బి.భవానీ, సర్పంచ్ ఎల్. రాజేశ్వరి, బి.తులసి పాల్గొన్నారు.

●**సాలూరు రూరల్:** కొఠియాగ్రూపులోని పట్టుచెన్నారు, పగులుచెన్నారు, గంజాయిభద్ర,సారిక,కురుకూటి పంచాయతీల్లో గ్రామసభలను ఆయాసర్పంచ్‌ల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఉపాధిపనులను ప్రతిపాదించనున్నారు. ఈ సందర్భంగా ఏపీవో రామకృష్ణ మాట్లాడుతూ అన్ని పంచాయతీల్లో గ్రామసభలను నిర్వహించినట్లు తెలిపారు.

● ఉపాధిహామీ కూలీలకు రోజుకు కనీసంగా రూ. 300 అందేలా పని చేయాలని ఏపీడీ రమేష్ రామన్ కోరారు. సాలూరు మండలంలోని తోణాంలో సర్పంచ్ మువ్వల ఆదియ్య ఆధ్వర్యంలో బుధవారం గ్రామసభలో జరిగింది. కార్యక్రమంలో ఉపసర్పంచ్ అప్పికొండ యుగంధర్ పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో పోలాల అమావాస్య

గరుగుబిల్లి / పార్వతీపురం టౌన్ : గరుగుబిల్లి, రావుపల్లి, కొంకడివరం, తదితర గ్రామాలతోపాటు పార్వతీపురం పట్టణంలో బుధవారం పోలాల అమావాస్య భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా వరి దుబ్బును పూజా మందిరంలో పెట్టి, పిండి వంటలతో పాటు పలు రకాల కాయగూరలు, ఆకుకూలతో వండిన కలగాయ కూరను నైవేద్యంగా సమర్పించారు.


పార్వతీపురంలోని కొత్తవలసలో పూజలు చేస్తున్న మహిళలు